# తనలో తాను

'ఇవాళ ఏకాదశి, మంగళవారం! భాద్రపద శుద్ధ ఏకాదశి పరివర్తన ఏకాదశి, వర్జ్యం' అంటూ బ్రాహ్మడు పంచాంగం చెప్పాడు! ముష్టి వేయించుకున్నాడు!

గౌరవం జారిన వృత్తి వైదిక వృత్తి! మహా మహా ఘనాపాఠీలకు దిక్కూ దివాణంలేని రోజులలో, ఎందుకూ పనికిరాక, ఏ విద్యా అబ్బక, ఆకలి దప్పులకు లోనౌతూ పుట్టుకవల్ల ఏదో వొరిగిందని నమ్ముతూ, మా తాతలు నేతులు తాగారుస్మా అన్నట్లు మా పూర్వులు 'ఋషులుస్మా' అని చెప్పుకుంటూ, తన పనిమీద, తన వృత్తిమీద, తన బ్రతుకుమీద, తన జన్మ మీద అసహ్యం ముద్ద కట్టినవాడు,—ముష్టికొచ్చే బ్రాహ్మడు !

నీళ్ళ కావిళ్ళు మోసేవాడు, ఎంగిలి విస్తరాకులు ఎత్తేవాడు, పీని గల్ని మోసేవాడు, ఎవరైనా ఏ వృత్తివాడు —తనకు యింత కావాలి అని

అడగ్గలడు? ఏ వృత్తివాడు అయినా అడగ్గలడు కాని, వైదిక వృత్తివారు అడగలేరు. యిచ్చినంత పుచ్చుకొని వెళ్ళవలసిందే! మరీ ముష్టికొచ్చే ముష్టి బ్రాహ్మడు.

పంచాంగం బ్రాహ్మడు, తిథి వార నక్షత్రాలు చెప్పి, తన మాట గోడలపరం కాగా, మళ్ళీ మళ్ళీ బిగ్గరగా అరచి, అరచి,

"వీడి పోరు తప్పదు" అని యింట్లో వాళ్ళు, నోటితో లేదనేది చేత్తో లేదు అనగా, ఆ వేసిన ముష్టే పదివేలు అనుకుని వెళ్ళాడు, పాపం ఆయన!

నిగ్రహానుగ్రహ సమర్థులయిన వారి సంతతి, పాపం, బ్రతుకుమీద వేదనలతో వుంటోంది!

అయినా అహంకారం పోదు! ఎట్లా పోతుంది! పుట్టుకతో వచ్చిన అహంకారం, వయస్సుతోపాటు పెరిగిన అహంకారం! అనేక దశలలో పోరాడి, అనేక స్థితులలో వేసారి, అనేక ఛిద్రాలలో ఘోషించి, అనేక కష్టాలతో కనలికనలి నానా జన్మలలోనూ నలిగి నలిగి నాశనం కావడమే పరమార్థంట. శ్రీ రమణ భగవాన్ చెప్పిందీ ఇదే.

"అహ మపేతకం నిజవిభావనం
మహదిదం తపః" అని.

భగవాన్ శ్రీ రమణులుల మాట గుర్తుకు రాగానే, వారి సమాధికి మనసా ప్రణమిల్లి, ఆ అరుణాచలం కొండకు మనసా సాగిలపడి, నెమ్మదిగా, బడికిపోయే మారాంపట్టిన పిల్లవానివలె ముందుకు పోతూన్న పంచాంగ బ్రాహ్మణ్ణి చూస్తున్నాను!

ఆయన్ను చూస్తూంటే విచారం వేసింది!

ఈ అలవాట్లు, ఆచారాలు అంతరించాయి!

ఎక్కడో, సకృతుగా గమనించ తగినంతగా వినబడుతున్నాయిగానీ వినబడ్డా, ఏమిటో—

ఏకాదశినాడు ఉపవాసం వుండడం, రాత్రి జాగరణ చేయడం, ద్వాదశి నాడు బ్రాహ్మడికి భోజనం పెట్టుకోడం, అదంతా జరిగిపోయిన నాగరికతా చిహ్నాలుగా వున్నాయి! నెలకు ఒకటి రెండు రోజులయినా వుపవాసం వుండడం శరీరారోగ్యానికి చాలామంచిది అని ఆంగ్లబాణీ వైద్యులు చెప్పినా మనం వినం! ఏదో ఒకటి, ముఖ్యంగా విషప్రాయమైన కాఫీ త్రాగుతూ వుంటేనేగాని రోజు గడవదు మనకు !

ఉపవాసం ఉండడం, అంటే భోజనం మానుకోడం అర్థం రావడమే మిగిలింది !

భోజనం గూడా మాని, దైవచింతనతో గడపడం అనేది — హంష్ కాకీ అయింది!

ఉప సమీపే వాసః అన్నది పోయి 'ఉపోషం' అయి అరగంటసేపు కాఫీ తాగకపోటానికి పర్యాయపదం అవుతోంది! బాగుంది!

సరేగాని, పరివర్తన ఏకాదశి అన్నాడేమిటి?

పూర్వం 'మురుడు' అనే రాక్షసుడుండే వాడట !

ఇతగాడు గాడెక్కి, దేవతాళిని గజగజ లాడించడం, గడగడ లాడించడం ప్రారంభించాడు! వాడి ధాకకు దేవతలు తాళలేకపోయారు ! వాడి పేరు వారికి సింహస్వప్నం అయింది! విష్ణుమూర్తి దగ్గరికి వెళ్ళి మొరపెట్టుకున్నారు !—

ఇక్కడే చిక్కు.

ఎప్పుడూ ఎవడో ఓ రాక్షసుడు ఏదో అఘాయిత్యం చేస్తాడు !

ఈ దేవతలు తక్కువవాళ్ళు కారు.

అమృతం తాగిన ధడవాలు, అంచేత చావరు ! మరి వీళ్ళకు యిదేం పోయేకాలం ! రాక్షసులకు హడలడం !

యింకా,

వీళ్ళు మాంచి బలాఢ్యులు! ఆ రాక్షసుణ్ణి యింతమందీ ఎందుకు చంపి పారెయ్యరు! యింతమంది కలిసినా, ఆ వేలెడంత వెధవనూ నలిపి పారెయ్యలేక పోతారా?

మరి పదే పదే ఆ విష్ణుమూర్తి దగ్గరికిపోయి, ఘోషిస్తారేం!

అదే గమత్తు.

నేటి జగత్తులో శిక్షాధికారం సర్కారు వారిదైనట్లు, దేవతలలో గూడా శిక్షాధికారం విష్ణుమూర్తిది కాబోలు! శిక్షాధికారం ఉన్న వారిదగ్గిర మొరపెట్టుకున్నారన్నమాట! జరగవలసిన తీరు అది! అంతే, తాము చెయ్యి చేసుకోరాదు! వారు తామై చేయి చేసుకోరు !

దేవతల గోడు విని విష్ణుమూర్తి బయలుదేరాడు!

మురాసురుడేం తక్కువవాడా ?

విష్ణుమూర్తి అంతవాణ్ణి ముప్పతిప్పలా పెట్టాడు !

విష్ణుమూర్తికి గూడా వీణ్ణి చంపటానికి ఉపాయం వెదకాలిసొచ్చింది అన్నమాట !

ఏం తనే చంపేస్తేేం....

తాను చంపితే, చచ్చినవాడికి మోక్షం వస్తుంది !

నీళ్ళల్లో నీళ్ళలాగా, తైలంలో తైలంలాగా దైవంలో వాడు కలిసిపోతాడు!

దైవం ఏదయినా యిస్తుందిగాని, మోక్షం యివ్వదు!

ఏం, ఎంచేత?

మోక్షం ఒకరు ఇచ్చేదికాదు!

అన్ని వాసనలూ కాలి, మనస్సు గూడా మాడిపోతే, మరి అంతా మోక్షమే! విష్ణుమూర్తి మురాసురుడికి కర్మవిపాకం ఇచ్చగించలేదు! విష్ణుమూర్తి దేహంనుంచి ఓ కన్య ఆవిర్భవించింది. ఈవిడే ఏకాదశి!

ఏకాదశీదేవి విష్ణుమూర్తి పంపున వెళ్ళింది! మురాసురుణ్ణి ఎదిరించింది. యుద్ధం చేసింది! సంహరించింది!

విష్ణుమూర్తి మురారి అయినాడు!

"నటన సూత్రధారీ మురారీ!"

ఈ ఉపకారం చేసినందుకు, ఏకాదశిని, 'ఏం కోరుకుంటావు' అని అడిగాడు!

"నేను సర్వకాలాల్లోనూ మీ ప్రియురాలుగా వుండేటట్లు అనుగ్రహించండి! అన్ని తిథులలో ప్రధానమైన తిథిగా వుండేట్లు అనుగ్రహించండి! నా పేరిటి తిథినాడు భక్తిశ్రద్ధలతో ఎవరు ఉపవాసిస్తారో వారు ముక్తిని పొందాలి" అని వరాలు కోరింది!

విష్ణుమూర్తి ఏకాదశికి వరాలు ఇచ్చాడు!

అప్పట్నించీ ఏకాదశులుండడం, ఏకాదశి వ్రతాలు ఆచరించడం ఏర్పాటు అయిందట!

ఇదొక పురాణగాథ.

మోహినీ రుక్మాంగద అందరికీ కొట్టిన పిండే!

ఐతే ఇదొక ఉదాహరణం!

ఇక్కడో సంగతి గమనించాలి!

నెలకు రెండు ఏకాదశులు!

సంవత్సరానికి పన్నెండు మాసాలు! అంటే ఇరవై నాలుగు ఏకాదశులు వస్తాయి. ఈ ఇరవయి నాలుగు ఏకాదశులకూ కామద, వరూధిని, మోహిని, అపర, నిర్జల, యోగిని, శయన, కామిక, పుత్రద, పవిత్రిని, ఇంద్ర, రమా ప్రబోధిని, ఉత్పత్తి, మోక్షద, సఫల, పుత్రద, షటిల, జయ, విజయ, పాపమోచిని అంటూ మనవాళ్ళు పేర్లు పెట్టుకొన్నారు.

ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి దాకా చాతుర్మాస్యలు అనుకున్నారు.

ఈ నాలుగు నెలలూ విష్ణుమూర్తి నిద్రిస్తాడు! అంటే- విష్ణుదేవతాకం అయిన నక్షత్రం, ఆకాశాన కనబడదు !

చాతుర్మాస్యలు, వర్షప్రాబల్యం ఉన్నకాలం! మనవూళ్ళల్లో నడవడం కష్టం! ఏ పని చెయ్యటానికీ వీలుగాని కాలం! సంపాదనలు తగ్గుతై- అందుకే "వర్షార్థ మష్టౌ ప్రయతేత వృష్ట్యై" అని వర్షాకాలం భుక్తిని, మిగిలిన కాలంలో సంపాదించుకో అని హితోపదేశం చేశారు! కృష్ణదేవరాయలు ఈ హితోపదేశాన్ని మరీ రమ్యంచేశారు ఆముక్తమాల్యదలో!

ఆముక్తమాల్యద—

ఏం గొప్పకావ్యం! అ-బ్బ రాయలవారికి భాషలో పర్వర్శిటీ వచ్చి పడిందిగాని, ఆయన భాషగూడా ప్రసన్నంగా వుంటేనా....!

కాళిదాసు :

"శాపాంతో మే భుజగ శయనాదుద్థితే శార్ఙపాణౌ
శేషాన్ మాసాన్ గమయచతురో
లోచనే మీలయిత్వా"

అన్న శ్లోకం 'కాళిదాసు మేఘదూత' చదవని వాళ్ళకూ కూడా తెలుసు.

'లోచనే మీలయిత్వా, కళ్ళు మూసుకుని నాలుగు నెలలు గడుపు' అన్న భాష తెలుగుగా వుంది గనుక, కాళిదాసు తెలుగువాడు, అనుకునే వాణ్ణి !

కాడు !

తెలుగువాడు కాడు అని ఆ శ్లోకమే సాక్ష్యం ఇస్తుంది !

కాళిదాసు తెలుగువాడైతే వొరిగిందేమిటి, కాకపోతే తరిగిందేమిటి ?

ఆయన కవిత్వం ప్రపంచ సౌభాగ్యాలలో ఒకటి! చాలదా?

ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి భాద్రపద శుద్ధ ఏకాదశికి వ్యవధి రెండు నెలలు! నిద్రించిన రెణ్ణెల్లకు విష్ణుమూర్తి నిద్రలో అటూ యిటూ తిరుగుతాడట. పరివర్తనం ఇది! కార్తిక శుద్ధ ఏకాదశినాడు నిద్ర లేస్తాడు! ఆయన, నిద్ర లేవడం మనకు గొప్ప పండుగ.

ఆనాడు క్షీరాబ్ది ద్వాదశి !

ఆనాడు మనవాళ్ళు వ్రతం చేస్తారు !

ఇలాగ ప్రతి ఏకాదశినీ పర్వంలాగ పూజించారు మన పూర్వులు.

మన పండగలూ, పర్వాలూ— మాసిపోయినై !

నిజమేగాని, పండగ, పబ్బం అంటాంగదా, పండగ సరే, పబ్బం అంటే ఏమిటో....?

ఒకటిగా తోస్తోంది.

'పర్వం' మనకు తెలుసు.

మహాభారతంలో పద్దెనిమిది పెద్ద పర్వాలు, వంద చిన్న చిన్న పర్వాలు.

అమావాస్యా పూర్ణిమలు పర్వాలు.

పర్వం అన్నమాట, ప్రాకృత భాషలోకి దిగి, పర్వ అయింది.

తెలుగులోకి - తమిళం వెండక్కాయ, బెండకాయగానూ,

'వండి' బండిగానూ, పరుషం అయి వూరుకుంది.

'పబ్బం' పర్వం ఒకటే.

పబ్బంనాడు కొన్ని కొన్ని విధులు నిర్వర్తించాలి! అవి మనకు రుచించవు!

అయినా తప్పదు! కనుకనే, 'పబ్బం గడుపుకోటం' అన్నది మన తెలుగులో తేలింది! బాగు.

ఉపవాసం కథయిందా.

ఉపవాసాలు పోయినాయిగాని, వారం వర్జ్యం చూడడం యింకా పోలేదు! వర్జ్యంలో ఏ పనీ తలపెట్టి ప్రారంభం చెయ్యరు! ఆ గంటన్నరా ఆగవలసిందే.

ఎవరికన్నా డబ్బు యివ్వడం, పసుపు, పసుపు కొమ్ములు అప్పు యివ్వడం మొదలయినచోట్ల — శుక్రవారం, మంగళవారం యింకా అడ్డు వస్తూనే ఉన్నాయి. ఏదో విధంగా వుంటయ్‌గాని నిత్యజీవితంలోంచి అన్ని ఆచారాలూ, అలవాట్లూ శుభ్రంగా తుడిచి పెట్టుకొని పోవు.

పైగా,

వయస్సు దాటేవారు, దాటుతూన్నవారు ఎప్పుడూ వుంటూనే వుంటారు! పైలా పచ్చీస్‌గాళ్ళ తృణీకరించడం సహజం.

యాభై దగ్గరవాళ్ళు, తాము తృణీకరించిన వాటినే, తిరిగి పూజించడం సహజం!

కాని, అసలుపోయి కొసరు మిగిలినట్లు- వెలా తెలా పోతాయి.

వేమనయోగి అంతవాడు -

దశమి యేకాదశి అటంచు వ్రతముబూని
మెతుకు తినకున్న దుర్గుణ మేలమాను!
పుట్టపై గొట్ట నురగంబు గిట్టబోదు!—అన్నాట్ట.

ఈ పద్యం వేమన రచనా పద్ధతికి చెందినట్లు తోచదు! కనుక వేమన్నది కాదేమో, ఆ తరువాత వారి చేర్పులా, కూర్పులా లోదేమో!

ఎవరిదైనా, వేమన్న అంతవాడి పేరుతో వచ్చిన ఉపదేశం అది!

వేమన్న తెలుగురుషి కదా?

తెలుగువాళ్ళం, మన జాతిలోని మహనీయుడి ఉపదేశాన్ని ఆచరణలో పెడుతున్నాం!

చాలు!

ఒక మంచి మాట విన్నా విన్నట్లే.

ఒక సుగుణం అబ్బినా తరించినట్లే.

# 2

"రాజూ వెడలె - రవి తేజము తోడుత
రాజూ, వెడలే - సభాకూ—"

రాజు వేషగాడు అన్న చరణాన్ని, హంగుదారులు తిరిగి తిరిగి అంటున్నారు. ముందుగా ఇది వెకిలితనం అనిపించింది. కానీ—కాదు—వివిధ రీతులలో అంటున్నారు. వివిధ భావాలను సువ్యక్తం చేస్తున్నారు. తెరలు, నగలు మొదలయిన ఆహార్యం బహు తక్కువ. ఆరు బయట పందిరిలో, శబ్ద ధ్వని సహాయంతో, అంతా ద్రష్టల భావానికి—ఊహలకి వదిలి వేస్తున్న యక్షగాన ఫణితి అది. తరువాత నచ్చింది.

రాజు తన సభకు ఇలా వెడలేవాడా అని.

ఎల్లా వెడలేవాడూ మరి?

అమిత ప్రతాపవంతులు, మహా తపశ్శక్తిసంపన్నులు, విరోధ భక్తిచే మోక్షాన్ని సాధిస్తున్న నాయకులు, ఆ రాజులు, ఆనాడు తమ తమ సభలకు ఆ లాగున వెడలే వారేమో రవితేజంతో.

ఒడ్డూ, పొడుగూ, ఠీవి, దర్పం, అహంకారం, మమకారం పరిపూర్ణంగా ఉన్న ఆ మహానుభావులు—ఆనాడు ఆ విధంగా వుండే వారేమో.

చెప్పలేం.

ఆనాటి మూర్తులకు ఇదంతా మన ప్రతీకం (Symbol) గానీ—ఆనాటి సాంఘిక చరిత్రలేదు. చరిత్ర లేదు. ప్రతిమలు లేవు. సరి అయిన వర్ణనలు లేవు. ఉన్నవి అయినా, భావ్య రక్తికి ఉపయోగించేవే. అందువల్లనే మన కవులు తమ తమ సంస్కృతీ బలాన్నిపట్టి ఆ ఆ భావాలకు ఈ విధంగా రూప కల్పన చేశారు. ఏమైనా, అందమైన రూపకల్పన.

మనస్సులకు హత్తుకొనిపోయే రూపకల్పన: రాజు రవి తేజంతో వెడలడం కాదా మరి, ఆ ఆ రూపాలను కల్పించింది ఎవరూ?

ఎక్కువ భాగం వ్యాసుడూ, వాల్మీకీ.

ద్రష్టలయిన రుషులు వారు.

నిజంగానే చూచే వ్రాశారేమో రామాయణ, భారత, భాగవతాలలో. అలాగే అయి వుంటుంది.

సుందర కాండలోని రావణ వర్ణన చూస్తే—నిద్రిస్తున్న రావణుడు, అతని రెండు చేతులు, దేహ సంపద చూస్తే—రావణునిమీద కోపం, అసహ్యం, ద్వేషం రాదు. అభిమానం కలుగుతుంది. లంకా వర్ణన ముందు అయోధ్య వర్ణన చాలా చప్పగా వుంటుంది.

మరి—

'ఇతర ప్రాణిక లభ్యమైన సిరిచే-ఏకాదశా క్షౌహిణీపతి' అయిన—దుర్యోధనుడు !

ఆతనికి అతనే సాటి అనిపిస్తుంది. దుర్యోధనుని వైభవం ముందు, ఆలోచన ముందు, అవతారమూర్తి కృష్ణుడు తక్క, తక్కినవారు సూర్యుని ముందు దివిటీలు అవుతారు.

ఆగు.

ఎవరికి? ఈ భావన.

కనీసం, నా హృదయానికి. అంతే! మరో మాట.

గతాను గతికంగా పోయి, శిల్పులు, చిత్రకారులు, కవులు – గుడ్డి ఎద్దు చేన పడ్డట్టు, దుర్యోధనుడు పాపిగానూ, రావణుడు తొట్టె పురుగుగానూ, కంసుడు క్రూరుడుగానూ చిత్రిస్తారు. గానీ, ప్రతిభావంతులు, అతి ప్రతిభులు— దుర్యోధనుని మహాభిమానిగా, రారాజుగా, యోధునిగా

చిత్రిస్తారు. రావణుని తపశ్శక్తి సంపన్నునిగా, పరాక్రమశాలిగా, కంసుని సాధకునిగా చిత్రిస్తారు.

మహానటులని పేరొందిన వారు గూడా—హిరణ్యకశిపుడు, కంసుడు, దుర్యోధనుడు మున్నగువారి భూమికలనే తాల్చి, ఆ ఆ మహా పురుషులలోని భావ సంఘర్షణా తీవ్రతను ప్రస్ఫుటించి జేజేలు పలికిస్తారు. ఎందుచేత? అప్పటికి కానీ, వారి కళాసృష్టికి పరిపూర్తి కాదు కాబోలు.

ఇంతకూ,

అసలు వ్యక్తులు ఉన్నారో, లేదో? - ఉండే వుంటారు.

సర్వసములై, ద్రష్టలయిన వ్యాస వాల్మీకులే ఈ ఈ దురంతకులైన పాత్రల్ని సృష్టించేటప్పుడు, సుఖ దుఃఖాలలాగ, వెలుగు నీడలలాగ మంచి—చెడ్డల్ని కలిసి, ఉద్ధృతమైన వేగం కలవారుగా చిత్రించారు. కర్ణుని మెచ్చనివారు అరుదు. కాని, కర్ణుడు కథారీతిలో—చెడిపోయిన పాత్ర. అర్జునుడిదే గెలుపు. ఐతేనేం, కర్ణుడు లేనిదే భారతంలేదు. కర్ణునికి జోహారు చేయని ధీర హృదయమూ లేదు. అలాగే రారాజూ, రావణుడూ, కంసుడూ, హిరణ్య కశిపుడూ - మున్నగువారు దైవోపహతులు. కాని, దైవానికి తప్ప, మరొకరికి లొంగని శూరులు!

వారి వారి శౌర్యమే మన హృదయాలను ఆకర్షిస్తూందో ఏమో, మరి? వారి వారి శౌర్యదీధితులకన్న, వారి వారి పరాక్రమ పరిధవాలకన్న రాచసిరి ధగధగలకన్న, వారిలోని ఆత్మ విశ్వాసం బహుశా మన్ని ఎక్కువ ఆకర్షిస్తుంది.

బహుశా, ఇదై ఉంటుంది—

కావడానికి వారు దైవోపహతులు. నిజమే. దైవోపహతులమీద సానుభూతి కొంచెం వుంటుంది. అంతకంటె బలంగా, వారిలో ఉన్న

లోపాలు మనలోనూ వుండటం కారణం అయి వుంటుంది. ఈ ఆకర్షణకు కంసునిలోని భయం, రావణునిలోని కాముకత్వం, రారాజు దుర్యోధనుని అసూయ మనకూ వున్నాయి. ఎటొచ్చీ, మనలో ఈ ఈ గుణాలు, మన పరాక్రమంలాగా నివురు కమ్ముకుని వుంటాయి.

వారిలో, కణ కణ లాడుతూ, భగ భగమంటూ భుగభుగలతో వుంటుంది.

పైగా వారు తమకు విధి ఎదురైందని తెలిసినా గూడా చలించని నగధీరులు, నిశ్చలులు.

మనం, ఎటు గాలి వీస్తే అటు కదిలిపోయే రావాకులం.

పైగా, వారి కీపీ, దర్పం, పొగరు అంతా మోక్ష సాధనకు ఉపయోగించింది.

ఇన్నిన్ని కలిసి—ఆ ఆ ధీరులు మన్ని ఆకర్షిస్తారేమో? ఏమో!

# 3

పసిపిల్లవాడు పొత్తులలో నిద్రపోతున్నాడు, మహా కావ్యంలాగ! నిద్రితుల్ని లేపలేను! అవసరం ఎంత ఉన్నా సరే, అన్నం తినేవారినీ, ఆదమరిచి నిద్రపోయేవారినీ—డిస్టర్బ్ చెయ్యలేను! మనస్కరించదు! నిద్ర పోతూన్నప్పుడు, మనిషి నిజ స్వరూపం బయట పడుతుంది! నిద్రా ముద్రితుడి నొసలు, కనులు, కనుబొమలు, పెదిమలు, అతని తత్వాన్ని పట్టి ఇస్తయ్! అన్నం ముందు కూర్చున్నప్పుడూ అంతే. మనిషి మనస్సు, మనస్సు నిలకడ, చిరచిర, తొందరపాటు, సహనం—అసహనం, నేర్పు ఇట్టే తెలిసి పోతుంది!

పైగా నిద్రా హారాలు ప్రాణికోటికి అవసరాలు! అవసరాలను తీర్చుకొనే వేళలలో—ఎవరి మనస్సూ కలత పడరాదు! కలత నిద్ర పోతూ, తెలివి వస్తే—పసి పిల్లలు ఏడుస్తారు! కాంత అయితే, కనుబొమలు చిట్లించి, నొచ్చుకుంటుంది. మరి ఒకర్ని నొప్పించి పొందే ఆనందం, నా వల్ల కాదు కనుక నిద్రించే వారిని లేపలేను!

పసిపిల్లవాడు నిద్ర పోతున్నాడు! ఎర్రని కలవ పువ్వులాగ! చెరువులో చేప కదిలితే, పద్మం చలించినట్లు—చిన్న అలయి వచ్చినప్పుడు—ప్రతిఫలించిన చందమామ బింబం చెలించినట్లుగా చిన్నగా కదులుతాడు! సన్నగా నవ్వుతాడు, ఒత్తిగిలి మైమరచి నిద్రపోతాడు.

మహాయోగికి సమాధి భంగం చెయ్యడం ఇష్టంలేనట్లుగా యివతలికి వచ్చేశాను! అరకంట చూచి ఆశీర్వదించి వచ్చేశా నివతలికి. పిల్లడు నిద్రలో ఉలిక్కిపడి లేచాడు! చిన్న పోరు పెట్టాడు! తల్లి వచ్చి ఉప్పుతో దిష్టి తీసింది!

కాస్త పోరు మానాడు!

ఈ దృష్టి తీయడం ఏమిటి? యింత ఉప్పు తీసుకుని వచ్చి, శుద్ధ తెనుగు భాషలో—యిన్ని తిట్లు ఎవరినో తిట్టిపోసి ఆ ఉప్పు, నీళ్ళలో పడేస్తే-ఉపశాంతి ఎలా కలుగుతోందో! అలాగే జేగురునీళ్ళు తియ్యడం, కచ్చికమీద చమురుపోసి దీపంగా వెలిగించి చుట్టూ తిప్పడం—యివన్నీ ఏమిటో అర్థం కానివి! ఆచారప్రాయాలు!

ఆచారప్రాయాలు అని చూస్తూ కొట్టి పారవెయ్యలేం. వాటి అవసరం వుండనే వుంది మనకు!

కొత్త కోడలుకు దృష్టి తగులుతుంది! ఆమె ఘుడుసుకుంటుంది! భయపడుతుంది! ఏ చనిపోయిన మహాతల్లో వచ్చి వాలుతుంది! చికాకు పెడుతుంది! నాడు సంసారాన్ని నిలూనా ఏడిపిస్తుంది! అలాంటప్పుడు-యీ అర్థం

లేవనుకున్న, అర్థం కావనుకున్న ఆచారాలు, మంత్రాలు తంత్రాలు పనిచేసి తీరుతాయి! మనవాళ్ళు మనసుపడి ఆవేశించి, మతం పెట్టుక్కూచున్న — బ్రహ్మరక్షస్సుల్ని, మంత్రశక్తితో పోగొట్టారు! శ్రీకృష్ణ దేవరాయలంత వాడు, మహా మనసుపడి, బ్రహ్మరక్షస్సు కథ వ్రాశారు! వాల్మీకి అంత వాడు, కవి, రుషి,—'ఛిద్రం కామృగయంతేస్మ విద్వాంసో బ్రహ్మ రక్షసాః' అని—కంఠోక్తిగా చెప్పాడు! అళీక సృష్టికాక, యథార్థమేమో బ్రహ్మ రక్షస్సులూ, దయ్యాలూ, దృష్టి-యిదంతా. గుండెలమీద పడుకున్న శిశువు పుస్తకంలాగ నిద్రపోతున్నాడు! కదిలితే ఎక్కడ లేస్తాడో అని నేను, కదల కుండా, మెదలకుండా పడి ఉన్నాను! ఎక్కడ నిద్రలేచి, కలతపడి, కంగారు పాలవుతాడో అని వాడితల్లి గబగబా తింటోంది! మేం ఉన్న చిన్నగదిలో, అందులోనూ సంపాదన తక్కువ అయిన వాళ్ళ చిన్నగదిలో, గాలికి గూడా భయమే! ధారాళంగా సాహసించి లోపలికి రాలేదు!

'నువ్వు తొందరపడి అర్థాకలిగా లేవకు. నేను చిచ్చికొట్టి నిద్రపుచ్చు తానులే!' అని నా భార్యకు చెప్పాలనిపిస్తుంది! చెప్తాంటే ఆ కదలికకు ఎక్కడ నిద్రలేస్తాడో అని భయం! తల్లి భోంచేసి యిల్లు సర్దుకుని వచ్చే దాకా పిల్లవాడు కదలకుండా నిద్రపోవడం, నా బాధ్యత! కదిలిస్తే కావ్యం వంటివాడు శిశువు! చిత్ర నిద్రలోని శిశువూ, భాండాగారంలో పుస్తకమూ చూడముచ్చటగా వుంటాయి! అవి కదిలాయో, కావలసినంత!

మహాకావ్యం అంతవాడు మా అబ్బాయి! అయితే మహాకావ్యం మధు రంగా ఒకప్పుడు ఉండకపోవచ్చు! మా అబ్బాయి మాకు ఎప్పుడూ మధురమే! చాలాభాగం మహాకావ్యమూ మధురమే!

మహాకావ్యం చదువుతూ వుంటాం! విచ్చిన సన్నజాజి చెండువలె, కావ్యం తేలికగా, సొంపుగా, సొగసుగా పరిమళిస్తూ వుంటుంది!

చేతిలోంచి సన్నగా జారి గుండెలమీద శిశువువలె విశ్రమిస్తుంది.

మనస్సుకు చక్కిలిగిలి. మన మనస్సే మామూలు మనోవేగాన్ని మించి పరు గెత్తుతుంది. కంటికి కనపడని, చెవులకు వినబడని, వెన్నెలవలె, చీకటివలె గుప్పిట పట్టుకోరాని సంగీతంవలె నిలబెట్టరాని ఏ స్థితికో పోతుంది, మనస్సు! అలిసిపోయి ఎక్కడో ఆగుతుంది ఆ మనస్సు ! ఎక్కడ ఆగుతుందో తెలి యదుగాని, ఆగినచోట గుంజాటన!

ఏ చిన్నతనంలోనో జరిగిన సంఘటన, ఏ కొత్త కాపురంలోనో అను కున్న మాటలు, ఏ అధికారి పెట్టిన హింసకో- ఏడ్చిన ఏడుపు, ఏ కత్తిమీది సాములోనో తగిలిన గాయం, ఎవరెవరు చేసిన సహాయలేశం, ఉపకార అప కారాలు, ఆమోద ప్రమోదాలు, విషాద వికాసాలు, ఏవి అడ్డు తగుల్తాయో తెలీదుగాని—మనస్సు మథనపడుతుంది !

అక్షరాలు మాటలవుతై ! మాటలు ఈటెలవుతాయ్! మనోరాజ్యంలో కుహకాలు, కుట్రలు, ద్వంద్వ యుద్ధాలు, కుస్తీపట్లు, కోడిపోరులు, గొర్రె పొట్టేళ్ళ పోట్లాటలు, గుర్రాల పరుగులు, ఏనుగుల ఘీంకారాలు, సింహ గర్జనలు—చివరికి సొమ్మసిల్లడం, ఎక్కడున్నామో తెలియకపోవడం !

పచ్చని మైదానాలు, చీకటిలో పర్వతాలు, అరకంట సరసంలాగ అర్ధచంద్రుడు, పెద్దలు, చిన్నలు, పరికిణీ తొక్కాడు బాలలు, మొటిమల సోయగాన్ని మరింత మనోహరంగాచేసే వాల్చూపుల వామలోచనలు, ఆజా నుజ్జ్వల బాహులైన అందగాళ్ళు, చిరిగిన చిత్రపటంలాంటి వృద్ధులు, జీసస్ ముఖంవంటి ముఖంకల అనాథలు, ఆపన్నులు కనబడతారు.

సంపన్నులు, సంపన్నుల దర్జా, ఠీవి, మృదుత్వం, వినయం, పొగరు మోతుతనం, నిర్లక్ష్యం, నిష్ఠురత్వం, కర్కశత్వం, వాళ్ళ కారుకూతలు. వాళ్ళ కారెక్కి పోవడాలు, వాళ్ళ తొందరలో వాళ్ళు ఎక్కిన కారు ఇతరుల మొహాన దుమ్ముకొట్టడం, వాన బురదనీళ్ళు చల్లడం — వొకటేమిటి — ఎందరెందరో సాక్షాత్కరిస్తారు !

నిత్యజీవితంలో ఎలా వున్నా, కావ్యజగత్తులో కావలించుకుంటారు! స్నానాల గదిలో మనిషి కనిపించినంతగా — కనబడతారు. పరమ ఆప్తుణ్ణి చూచినట్లు చూస్తారు! తమలో మనల్ని లీనం చేసుకుంటారు! మనలో తాము అణిగి మణిగి ఉంటారు! మన అనుమతితో, మన మనస్సుమీద- మనోహర మైన సాము చేస్తారు!

గెలుపు వారిది!

మతిమారడం- మనకు!

ఎన్ని బాణాలు వారు విసిరినా హింసలేదు. వారివన్నీ సమ్మోహ నాస్త్రాలే. సమ్మోహనాస్త్రం అనేమాట, ఎంత వాడుకలోకి వచ్చింది— ! ఆ అస్త్రం విలువ కాళిదాసుకు తెలుసు! ఆయన విప్పి చెప్పాడు-

'ప్రయోక్తు ర్నచారిహింసా, విజయశ్చహస్తే' అని—పుస్తకం సమ్మోహనాస్త్రం!

పుస్తకం చదవడం ఎంత గొప్పది!

అదొక యోగం.

పుస్తకాన్ని చదవడం యోగమైతే, కొనుక్కోడమో- పుణ్యం. సొంత పుస్తకం, సరికొత్త పుస్తకం, కొత్త తాటాకుల పందిరిలాగా కొత్తదనపు పరిమళాలను వెదజల్లే పుస్తకాన్ని తెరిచి- ఏదో వెర్రి సంతోషంతో వాసన చూచేవాళ్ళం చిన్నప్పుడు. నెమలి ఈక పిసరుతెచ్చి, కొత్త పుస్తకంలో పెట్టి కళ్ళకు అద్దుకొనేవాళ్ళం. ఆ నెమలి ఈక పిసరు, సరస్వతీదేవి అనుగ్రహాన పెరిగి పెద్దదౌతుందని ఉవ్విళ్ళూరే వాళ్ళం! కొత్త పుస్తకాన్ని యెవరన్నా అడిగితే, ముట్టుకుంటే, చూస్తే — పుస్తకం మాసిపోతుందని గిజగిజలాడే వాళ్ళం. సరికొత్త పుస్తకం, పల్లకీలో ఊరేగుతూన్న పెళ్ళికూతురు లాంటిది!

చదవటం ఎంత యోగమోగాని, చదివిన వారిని గురించి Second hand పుస్తకం మౌనంగాచెప్తుంది, చదువుతూన్నప్పుడు తమకు తోచేవన్నీ వ్రాసేస్తారు కొందరు అక్కడే! గీతలు గీస్తారు కొందరు! ఆ ఆ స్థలాలు చదివినవారి అంతస్థును—యిట్టే పట్టి యిస్తాయి! వారి వారి అజాగ్రత్తలు, అసంతృప్తి వాసనలు, భయాలు, ఆందోళనలు — అన్నీ తెలుస్తాయి మనకు.

పుస్తకం ఖరాబు చేస్తారు మరి కొందరు మహనీయులు.

కొందరు చదివిన పుస్తకం తాజా తాజాగా వుంటుంది. భాసా సుబ్బారావుగారు, మల్లాది రామకృష్ణశాస్త్రిగారు చదివిన పుస్తకాలు చందమామ లాగా శుభ్రంగా, అందం చెడకుండా నవనవ లాడుతూంటాయి!

పుస్తకం ఎంత విలాస వస్తువుగానో మారింది. కొన్నవారి పేరును ఎన్ని వికారాలతోనో వ్రాసుకుని మురిసి పోవచ్చు! చిన్నప్పటినుంచీ అందరూ అనేక విధాల పిలిచిన పేరు—సవాలక్ష పర్యాయాలు సంతకం చేసిన పేరు, ప్రతిచోటా నవరసుల్లా ఆకర్షణతో, వజ్రాల మెరుపుతో మోగిపోవాలని ఆశలుపడ్డ పేరు, అలుగ్గుడ్డలాగా మన దగ్గిరే ఆగిపోయిన పేరు — బహు పాత పేరు—అన్నన్నిసార్లు, అన్నన్ని వంకరలతో వ్రాసుకొని చూస్తేనే గాని వారికి సంతృప్తికాదు కాబోలు—అద్దం ముందు నుంచుని, తమ ముఖాన్ని చిట్లించి, వికార పరచి చూసుకుంటేనేగాని కొందరికి తోచనట్లు!

కావ్యంలో గంతులు వేసేది కవి హృదయమా, మన హృదయమా అని ప్రశ్న! ఎవరి సంగతో అని ప్రారంభించి, మధ్యలో మన సంగతే యిది అని విస్తుపోయి, కలిసిపోయి, కరిగిపోయి, చివరికి నిట్టూర్చడం జరుగుతుంది సాధారణంగా. ఆ కల్పిత పాత్రలు వాస్తవంగా బ్రతికినవారి కంటె నిజం అవుతారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, ద్రౌపది, కుంతి, కైక, మంథర, శూర్పణఖ, కుంభకర్ణుడు, కర్ణుడు, శకుని, కుచేలుడు, హను

మంతుడు - వీళ్ళంతా నిజంగా బ్రతికితేనేం—కవి కావ్య నిర్మాణంవల్ల బ్రతికితేనేం?

మా తాతగారినీ ఎరగను. ధృతరాష్ట్రుణ్ణీ ఎరగను.

మా నాయనమ్మనూ ఎరగను. కుంతీ మహాదేవినీ ఎరగను.

అయినా తాతగారికంటె ధృతరాష్ట్రుడు, ద్రోణుడు వీళ్ళంతా నాకు తెలుసు.

కుచేలుడు తెలుసు! కాన్పులు కని కని డీలాపడిన పేద యిల్లాలు కుచేలుని భార్య నాకు తెలుసు! కుంతీ, సీతా, ద్రౌపదీ, గాంధారీ, సత్యభామా నాకు తెలుసు!

మా నాయనమ్మ నాకు తెలియదు.

వాస్తవమైన నాయనమ్మ తెలియదు. కల్పనా వ్యక్తులయిన గిరీశం, బుచ్చమ్మ, రామప్పంతులు, పేరిగాడు, చెకుముకిశాస్త్రి తెలుసు!

అదే కవి ఘనత.

నా పసితనం నాకు తెలియదు. కాని తాను ఏమీ చెప్పకుండా, మాట లయినా రాని దశలో తెలియ చెప్పినవాడు, అబ్బాయి!

అబ్బాయి, వో మహాకావ్యం, వో మహాకవి! కవులకు కవి అయిన వాగీశ్వరుడు!

రేపు వాడు పెరిగి పెద్దవాడె అయి, ఎంత వాగి వాగి రాజకీయ నాయకుడే అవుతాడో, తక్కువ మాట్లాడి, ఎక్కువ పనిచేసి సమర్థుడే అవుతాడో! ఇతరులచేత పని చేయించి, తాను సుఖించే అధికారి అవుతాడో-కాంతల ముద్దు మాటలకు కరిగి, కాముకుడే అవుతాడో, లేక—వారిని కరిగించి సుఖపెట్టి సుఖపడతాడో—ఏమో!

# 4

సాయంత్రం. సంధ్యా సూర్యుడు లోకాని కంతకు కనకాభిషేకం చేస్తున్నాడు. నేల, నీళ్ళు, మొక్కలు, మోడులు, చెట్ల చివళ్ళు, ఇళ్ళ వాకిళ్ళు, గుళ్ళూ, గోపురాలు—ముఖ్యంగా గుడి గోపురాలు సంధ్యా స్వర్ణ వర్ణంతో ధగధగలాడి పోతున్నయ్.

"రారా—గుళ్ళోకి పోయి వద్దాం!"

"ఎందుకు—?"

నేను రాను అన్నది నా కంఠంలో ధ్వనిస్తోంది. గుడి అంటే నాకు ఎంతో యిష్టం. కొంతకాలం అయినా, అక్కడ చేరినవారు—ఐహిక బంధాలను, బాధలను మరచి, దివ్య భావనలతో కాలక్షేపం చేయడానికని ఏర్పడ్డవి గుళ్ళు. నాగరికతకు ఒకప్పుడు కేంద్రాలు గుళ్ళు.

వేదాధ్యయన పరులు, ఘనాపాఠీలు స్వామికి వేదగానంచేసి, స్వస్తి చెప్పారు. స్వస్తి వాచనం ఫలాలు అనుభవించారు. రాజులు తమ రాజ్యం స్వామిది, తాము స్వామికి ప్రతినిధులం అనుకొన్నారు. వర్తకులు స్వామికి భృత్యులై, సర్వమూ విలిచి, అమ్మి జీవించారు. మిగిలిన కులాల వారు, తమ ప్రతి పనీ స్వామికోసం అనుకొంటూ జీవయాత్ర సాగించారు.

విద్యార్థులు ఆ గుడి గోపురాల నీడను విద్య నభ్యసించారు. కళార్థులు తమ తమ కళలకు పరమావధిని స్వామిసేవలో చూచుకొన్నారు. కాలం, కర్మం, కలిసిరాక గుడి గోపురాలయందు శ్రద్ధ తగ్గి, మడి మాన్యాలందే మక్కువ ఎక్కువై—

తుంటరులకు సమావేశ స్థానాలుగా, పిల్లలకు క్రీడా భూములుగా,

జూదరులకు అనువైన చోట్లుగా కొన్ని గుళ్ళు వెలిసినయ్. పూజ్యభావం పూజ్యమై, విచారం వేస్తుంది గుడికిపోతే. అందుకూ నేను రానన్నాను.

"రారా! భారతం పురాణం చెబుతున్నారు. తింటే గారెలే తినాలి, వింటే—భారతమే వినాలి!"

నా మనస్సు చలించింది. అవునవును. గారెలు బలవర్ధకములు. గారెలు వాజీకరణం. తెనుగు వాళ్ళకు యిష్టం. భారతమో? అమ్మో. రామాయణ భారత భాగవతాలు యావద్భారత జాతికీ అమిత ముఖ్య గ్రంథాలయినా తెలుగు వాడికి భారతం అంటేనే యిష్టం. అల్లాగని రామాయణాన్ని కాదనడు. సీతమ్మ కష్టాలు తలుచుకొని కన్నీరు అయిపోతాడు.

ఆగు.

సహృదయత మాత్రమేకాదు స్మా!

అవును నాకు తెలుసు. రామాయణ భారతాలు తెనుగు జాతిలో, తెనుగు రక్తంలో కలిసినై. ఆడపిల్ల పుడితే సీతమ్మ, మొగబిడ్డ పుడితే-రామయ్యా - అమ్మో, ఆంధ్రులు సీతారాములను స్మరించని రోజు అంటూ వుండదు.

సీతారాముల్ని ఎట్లాగ విస్మరించగలరు? సీతారాములు ఆనాడు, ఈ తెనుగు గడ్డమీద, వారి దివ్య పాదాలను మోపారు గూడాను. పాపం, కాళిదాసు కాబోలు అన్నాడు! "వంద్యైః అంసాం రఘుపతి పదైః ఆంకితం మేఖరాసు" అని !

ఆనాడు సీతారాములు ఈ తెనుగు గడ్డమీద నిలిచి, ఈ తెనుగుగడ్డ గాలి పీల్చి, ఈ తెనుగుగడ్డ సమర్పించిన కందమూలాలు ఆరగించి, గోదావరీ స్వాదు జలాలను అనుభవించి - ఏం ఏం అనుకొన్నారో??

వారేం అనుకొన్నా, రామాయణం నా జాతి రక్తంలో కరిగింది.

వాడా, "అగస్త్యభ్రాత" అని ఈసడిస్తాం.

అదా లంకిణి! అని జిచ్చపడతాం.

సరి! వాడుట్రా, వాడో ఇంద్రజిత్తు! అని తెల్లపోతాం.

వాడితో నీ కెందుకురా! వాడు, కాలనేమి అంత వాడురా అంటాం.

అదా నాయనా, చెప్పవేం, అది మళ్ళీ 'మంథర' అనుకో. అని వాపోతాం.

అహ. ఏం అదృష్టం, మండోదరిలాగా ఇల్లు నిండిన కోడలమ్మా అని ప్రశంసిస్తాం.

సరి సరి. వాడు 'జాంబవంతుడ్రా!' అంటాం.

బాబోయ్. అదో మప్పనాతి అని భయపడతాం.

చిత్రం. శూర్పణఖ అంటే—చాటలంత పెద్ద పెద్ద గోళ్ళు కలది అని గదా అసలు అర్థం.

తెనుగులో అసలు భావం మిగిలి 'మప్పనాతి' అని కొత్త పేరొచ్చింది శూర్పణఖకు. నాతి అంటే స్త్రీ! 'మప్ప' అంటే ఏమిటో?? ఓర్వలేనితనం. పాపాశంకి మనస్సు. ఇల్లాగ ఏమన్నా అర్థం ఉండేదేమో. ప్రాచీన కాలంలో- ఇల్లాగ రామాయణం జీవితంలో కలిసిపోయింది.

రాములవారి గుడి, రాం మందిరం, రాం భజనా అంటూ లేని గ్రామం వుండదు కదా. నిజం!

నిజం!

రామాయణం, భారతం జాతిని అంత పదును పెట్టినై. భారతానికీ భారతగాథకూ తక్కువలేదు మనలో.

వాడా శకుని అమ్మో అంటారు.

'శకుని' అంటే అదేం పేరో. శకునం అంటూ వుంది. శకునం అంటే పిట్ట. బహుశా, సర్వానర్థకారి శనీ, అంతగా మండిపడేవాడు కుజుడూ ఈ రెండు గ్రహాల పేర్లూ కలిపి సృష్టించుకొన్న పేరేమో-'శకుని' "శల్యసారథ్యం చెయ్యవద్దురా బాబూ!" అంటారు.

'కర్ణుడులేని భారతమా!' పాపం, అంతవాడు గాబోలు కర్ణుడు.

కర్ణునౌదలనె భారత సంహిత నిల్చి చాద్పునన్ ! అన్నాడు తెనాలి రామకృష్ణుడు గూడాను. కర్ణుని దాన వీరతకూ, వీరతకూ చేతులు జోడించని వాడు ఉండడు గదా!

ఎటొచ్చీ-ధర్మరాజే గడుసువాడు అందరిలో. తెలుగు ఋషి-వేమన్న 'పేరు ధర్మరాజు పెనువేపవిత్తయా?' అని ఈసడించి పారేశాడుగాని-

* * *

అల్లుకునిపోయినై. భారతం రామాయణమూనూ మన జీవితంలో. అవునా, యిక్కడేవుంది చిక్కు గూడాను. పసితనం నుంచీ, వారూ వారి పేర్లూ, గాథలూ వింటూ వుంటాము. భారత కథ పూర్తిగా మనకు తెలుసూ. అనలేం, తెలియదు అనలేం. ఏంచేత? పెద్దవాళ్ళు చెప్పటం, చెప్పుకోటం, అల్లాగ ఇల్లాగ, భారత కథారసం మనకు తెలుసు. తెలుసుగదా అని అసలు గ్రంథాన్ని మనం ఎన్నడూ చదవం!! అవునుస్మా.

"ఉఁ. సరే పదవయ్యా, ఇల్లాగయినా భారతం వింటం పడుతుంది" అన్నా.

# 5

అమావాస్యా కొత్త మంగళవారం పూటానుట్రా? మా పెదనాన్న కోప్పడుతున్నాడు. ఇంతకీ-నేను మాత్రం ఏం చేస్తానన్నానూ ? చొక్కా విరిగిపోతే-కొత్త చొక్కా తొడుక్కుంటానన్నాను.

ఇవాళా నీకు దొరికిందీ, 'అమావాస్యా కొత్త మంగళవారమా ?' అని మళ్ళీ గదమాయించాడు.

ఆనాడు మంగళవారం. నిజమే. అమావాస్య కాబోలు అనుకున్నాను. కొత్త మంగళవారం ఏమిటీ? కొత్త మంగళవారం, పాత మంగళవారం అని వేరు వేరుగా వుంటాయా? పాత మంగళవారం పనికి వచ్చి - కొత్తమంగళ వారం పనికిరాదా? అనుకున్నాను. ఏం లాభం? పైకి అనలేనప్పుడూ, మనసు లోని మాట అని సౌమ్యంగా నెగ్గించుకోలేనప్పుడూ తల వంచుకొని పాత చొక్కాతోటే కాలక్షేపం - చేయాలి.

*　　　　*　　　　*

కొత్త మంగళవారం ఏమిటా? అని.

ఓహోహో !

ఆనాడు ఫస్టుతారీఖు. మొదటి తేదీ. నెల ప్రారంభిస్తోంది. ఈ నెలలో ఇది తొలి మంగళవారమూ, కొత్త మంగళవారమూనూ మరి!

ఇంగ్లీషు నెలలకూ, మన తిథి వారాలకూ ముడిపెట్టారు పెదనాన్న! అవునవును. తూర్పు పడమల నాగరికతల సమ్మేళనం మనమీద తాండ విస్తోంది!!

గింజుకుంటున్నారు.

ఏం అమావాస్య అయితే—? ?

ఏం మంగళవారం అయితే- ? ? అని.

ఓహో—ఇదా ?

మనం చాంద్రమానంవాళ్ళం. మనకు తిథులనూ, శుభాశుభాలనూ, కాలాన్నీ నిర్ణయించేది చంద్రుడు. చంద్రుడు ఈ అమావాస్యనాడు సంపూర్ణంగా కనబడడు. పూర్ణచంద్రుడు శుభుడు. మధ్యచంద్రుడు మధ్యమం. క్షీణచంద్రుడు అశుభం; అనిగదా మన సంప్రదాయం. చంద్రుడు అసలే కనబడని—అమావాస్య, అశుభం కిందేలెక్క. బాగానేవుంది.

మరి మంగళవారం బాధ ఏమిటి??

మంగళవారం పనికిరాకపోవటం ఎంచేత?

*　　*　　*

న కుర్యాత్ శని భౌమయోః - శనివారం, మంగళవారం చెయ్యగూడదు. కుర్వీత బుధ సోమయోః - బుధవారం, సోమవారం చెయ్యాలి. ఇలాంటి కారికలను వింటుంటాం. చేసేపనులని బట్టి, కొన్ని పనికివచ్చే వారాలూ, కొన్ని పనికిరాని వారాలూనూ అన్నమాట!

అలాగే కనబడుతోంది....

ఆడపిల్లలు శ్రావణమాసంలో పూర్ణ చంద్రుడున్నప్పుడు శుక్రవారం నాడు లక్ష్మీపూజ చేసుకుంటారు. శ్రావణమంగళవారాలు, ముత్తయిదువులను పేరంటానికి పిలుస్తారు! పున్నమి పున్నమికీ చంద్రుడికి పూజలు చేస్తారు. బుధవారంనాడు మొగపిల్ల పుడితే—వాడు భూములు ఏలుతాడు అనీ, శుక్రవారంనాడు ఆడపిల్ల పుడితే - లక్ష్మీదేవి అనుగ్రహాన అష్ట ఐశ్వర్యాలూ అనుభవిస్తుందనీ అంటారు. కొందరు, శుక్రవారంనాడు లక్ష్మీదేవికి పూజ చేస్తారు. ఆనాడు చేబదుళ్ళు ఇవ్వరు. ఆమాటకొస్తే కొందరు మంగళవారంనాడు చేబదుళ్ళు ఇవ్వరు. అవతలవాడు, నావంటివాడు, ఎంత

గిలగిల లాడుతున్నా, ఇవాళ శుక్రవారం చూడండీ అనేసి తప్పించు కుంటారు. శనివారం ఉదయం, దుర్ముహూర్తం. ఏ పనికీ పనికిరాదు అంటారు. ఆదివారంనాడు ఆఫీసులకు సెలవు ఇస్తారు. ఇల్లాగ - మరి వారాలప్రభావం మనమీద వుండనే వుంది.

లేదూ అని ధీమాగా అనలేం. అందుకేనేమో—

పెదనాన్న వొద్దని కోప్పడింది—అఁహ.

*　　*　　*

అవునా?- అనేకదేశాలు. దేశదేశాలలో చిత్రాలా విచిత్రాలా పర స్పరం విరుద్ధాలా అయిన ఆచార వ్యవహారాలు ఉన్నయ్. గానీ, వారాల దగ్గర అందరూ ఏకాభిప్రాయం కలవారే ఐనారుస్మా. ఎందుచేతో??

ప్రపంచం అంతా, ఏడేవారాలు. అవీ గ్రహాలపేర్లతోనే ఉన్నయ్— ఎంచేతో??

బహుశా ఒకటయి వుంటుంది.

ఏనాడో, ప్రపంచంలో, ఏదేశంలోనో, ఎవరెవరో, ఎందరెందరో మహామహులు కాలాన్ని లెక్కించడం, పరిగణన చెయ్యడం చేసి వుంటారు. అదే అన్నిదేశాలకూ ప్రసరించి, స్థిరపడిపోయి వుంటుంది. లేక—

లేక?

లేక - వివిధ దేశాలలోని ఖగోళశాస్త్రవేత్తలు - కాలపరిగణనలు చేస్తే- అన్నిదేశాలలోని లెక్కలూ, ఫలితాలూ ఒకటే అయివుండనూవచ్చు. కావచ్చు. కానీ—

మనదేశపు విద్వాంసులు ఎలా పరిగణనచేశారో-??

*　　*　　*

భూమిస్థిరంగా వుంటుంది. అందుకే భూమికి 'స్థిర' అని పేరు గూడాను. ఈ భూమిచుట్టూ గ్రహాలు తిరుగుతూ వుంటాయి. ఆ పరిభ్రమణంలో—చివరినుంచి చూస్తే—వాటిక్రమం— శని, గురు, మంగళ, సూర్య, శుక్ర, బుధ, చంద్రులు. మొదటిది శని అనుకుందాం. వరుసలో, ఒక దానికి నాల్గవది, రెండవదిగా వస్తుందన్నమాట. శనికి నాల్గవది సూర్య. సూర్యుడికి నాల్గవది చంద్రుడు. చంద్రుడికి నాల్గవది, మంగళ. ఇల్లాగ అప్పుడు, మనం ఇప్పుడు వ్యవహరించే వరుసను, శని ఆది సోమ మంగళ బుధ గురు, శుక్రల వరుస వస్తుంది. ఒక్కొక్క రోజుకు ఒకొక్కరు అధిపతి. అధిపతి పేరున ఆ రోజును పిలుస్తారు అన్నమాట!

బాగానే వుందిగానీ, వరుసక్రమంలో, తరువాతది రాక—

నాల్గవది ఎందుకు వస్తుందీ? అని. - అఁహ.

అహోరాత్రాలు, 24 గంటలు. గంటలకు గ్రహాల వరుసగా అధిపతులుగా వస్తారు. రోజుకున్న 24గంటలలో, సప్తగ్రహాలూ, మూడుసార్లు ఆధిపత్యం వహిస్తారు. ఇంకా మూడుగంటలు మిగులుతై. కొత్తరోజు ప్రారంభించే సరికి, నాలుగవ వాని ఆధిపత్యం వస్తుంది సహజంగా. ఇదన్నమాట-రహస్యం— చాలావుందే—

అయితే మరి—ప్రారంభం ఎక్కడనుంచీ అని—

ఎప్పుడో అదీ నిర్ధారణ అయివుంటుంది. లెక్కా అప్పుడే నిర్ధారణ అయివుంటుంది. చెప్పలేం—

హిందువులు, 'ఉదయా దుదయం వారం' అని లెక్కిస్తారు. మహమ్మదీయులు సూర్యాస్తమయం నుంచి సూర్యాస్తమయం దాకా లెక్కిస్తారు. పాశ్చాత్యులు మధ్యరాత్రి రాత్రి 12గంటలనుంచి, తిరిగి రాత్రి 12 గంటల దాకా లెక్కిస్తారు.

ఎవరి యిష్టం వారిదీ— ఎవరి లెక్క వారిదీ—అంతే.

# 6

శ్రావణమాసం. నిండుచూలాలివంటి మేఘాలు. చంద్రునికి చుట్టూతా చేరి అందాలను కొల్లలాడే మేఘాలు. సూర్యకిరణాలను చొరనీయకుండా దడికట్టినట్టు అడ్డుపడగల మేఘాలు, నిమిషం నిమిషం రంగులా, రూపాలా మార్చుతూ, చల్లదనమునూ, అందాన్నీ ఆనందాన్నీ ప్రసాదించే మేఘాలు, జీవనప్రదాతలయిన మేఘాలు!

కాంతల కబరీ భరంలాగా, కాటుక కన్నులలాగా, కృష్ణపరమాత్మలాగా మేఘాలు! ఓః! అవునవును. నల్లకలువను, మబ్బును, నీలంగా వున్న ఏ పదార్థాన్ని చూచినా శ్రీకృష్ణ భావనతో మైమరచేవారట మహాభక్తులు!!

తాము గోపికలు. యావత్ప్రపంచము గోపికలు!

స్వామి?

శ్రీకృష్ణుడు!

ఎంత గొప్పభావన!!

యమునా, యమునానికుంజాలు, మధుర, బృందావనం, రాసమండలం—అన్నీ తమ హృదయకేదారమే. మహాయోగుల మననధార రాధ! ఆహా! ఓహో! అవునవును. భ్రమరకీటన్యాయం తెలిసి, ఎలాగా కావలిస్తే అలాగా జీవి అవుతుందని తెలుసుకున్నవారు మరి ఆ మహాత్ములు.

నిజమేగానీ-

కంసుడికి-ఎందుకు ఆ కర్మమో—

తానా, సాక్షాత్ శ్రీకృష్ణునికి మేనమామ. మేనమామ అంటే— తల్లి తరువాత తల్లివంటి ప్రాణి. లాలించి, ఎత్తుకొని - ముద్దాడి, హృదయానికి చేర్చుకొని, సంబరం పడిపోవలసినవాడు గదా మరి—కంసుడు—

పసివాడు, తన్ను పుత్రం ఆరుస్తాడు అని— ఎందుకు భయ పడ్డాడో— ??

వోవేళ, అంతగా పోవాలిసొచ్చి, పోతే-పోతాడు. ఈమాత్రం గుండె నిబ్బరం ఎందుకు లేకపోయిందో??

ప్రాణభయం. భయం ఆవరిస్తే-మనస్సుకు ప్రసన్నత్వం ఎక్కడిది? భయం, అందులోనూ ప్రాణభయం ఆవరిస్తే-అంతే జరిగేది! పైగా కంసుడు రాక్షసీ!!

పైగా నారదుడు— సర్వయాదవులును సురలుగాని, నిజంబు నరులు కారు అనీ—కంసుండ నీవు రక్కసుడవనీ చెప్పాడు గూడాను!!

రాక్షసికి తగినబుద్ధులు కంసుడికి వచ్చినై. అంతే-

అంతేనా?

మరీ, శ్రీకృష్ణుడు, బలరాముడు, వసుదేవుడు, నందుడు, యశోద, దేవకి-వీళ్ళంతా దేవతలా? కంసుడు, వీళ్ళకు కావలసినవాడు, బంధువు రాక్షసా?

ఎల్లాగ? వివేచన చేయడం??

* * *

"రాక్షసులు" అనేజాతి వేరేజాతా? కాదు. బావ దేవుడు, బావమరిది రాక్షసీ అని ఇక్కడే తేలింది! మరి మనోధర్మాన్నీ గుణాన్నీ పట్టా ??

అయివుంటుంది.

దేవతలకూ యజ్ఞాలూ, యాగాలు, బలులు, క్రతువులు, వరాలు పొందడం అన్నీ ఉన్నయ్. రాక్షసులకూ యజ్ఞయాగాది క్రతువులూ, బలులూ, వరాలు పొందడాలు వున్నయ్. ఐతే! ఒక్కటి అయివుంటుంది.

తమతమ శక్తిరక్తుల్ని - ఈశ్వరార్పణం చేసినవారు, 'అహం' అన్నదాన్ని చంపడానికి తామై పూనుకొని, తమతమ అహంకారాన్ని తామే 'స్వాహా' చేసుకున్నవారు దేవతలు.

తాము తమతమ శక్తిరక్తులు, యజ్ఞయాగాది క్రతుకలాపమూ వరాలు పొందడమూ అంతా తమతమ విజృంభణకు—

తమతమ అహంకారలీలలకు—

అనుకున్నవారు. అహం విజృంభకులు, రాక్షసులు—

ఓ!

కంసుడు రాక్షసుడు అంటే ఇదా తత్వం!

నేను సుఖంగా వుండాలి. ఇదంతా నా ప్రయోజకత్వం. నా మాట నెగ్గాలి. నా రాజ్యం ప్రబలాలి. నా పట్టు నెగ్గాలి, నాకంటె పరుదెవ్వరునూ లేరు. అనే వాపతు- కంసుడు.

మరి వీరికి ముక్తి! అదే, అహంకారవిమోచనం!

అవతారమూర్తులు ఇందుకు అవతరిస్తారన్నమాట.

* * *

ఇందుకు కంసునికి భయం స్థాయీభావం అయిరావచ్చుంటే!

అవునుగానీ, మరోవిధంగాచూస్తే—!

* * *

లోకంలోని చండశాసకులు అందరూ కంసులే.

తమతమ కోట కట్టుకోటానికీ, తమతమ భీరుత్వాన్ని కప్పెట్టుకోటానికీ ప్రబలులూ, ప్రచండులూ అవుతారు.

మృతికి వెరుస్తారు. అంతకన్నా, తమతమ, పదవి, ప్రాబల్యం, ఘనతల చ్యుతికి గిలగిలలాడి తల్లడిల్లి పోతారు.

నసాళం పగిలేటట్టుగా, విధి దెబ్బకొడుతుంది.

త్రాహి త్రాహి అవుతారు.

త్రాహి త్రాహి అవుతారా? అని.

అందరూ కారు. కొందరే అవుతారు. మిగిలినవారు, కంసునిలాగా తమశక్తుల్ని అన్నీ ప్రయోగించి, కంటకులై పోతారు.

నిజమే స్మా!

కంసుడే కంటకుడు కాలేదు. నేడూ, రేపూగూడా కంటకులు అంటూ వుండకపోరు.

విధే, చేయిచేసుకొని, వీరినీ ఓమార్గంలో పడేయాలన్నమాట!

ఇదా కంసమోక్షం!

ఇందుకా కృష్ణుడంతటి అవతారం సంభవించడం!

చెప్పలేం.

ఏ ఒక్కరికోసమో అయితే అవతారం సంభవించదు. మృత్యువే అన్ని తీర్పులూ తీరుస్తుంది. లోకం, ప్రపంచంలో ఎక్కువమంది, మనుజుల ఆశాప్రతీక్షలు, ఆలోచనామార్గాలు, చేస్తున్న దురంతకాలు, దుర్బుద్ధులు, అంతా స్వార్థం, డంబం, వంచన, మోసం, ద్రోహం అయినప్పుడు, ప్రతిసాధుహృదయమూ హాహాకారాలు సలిపినప్పుడన్న మాట! అవతారం!! ఓహో!!

# 7

తెల్లవారుతోంది. నిద్రిస్తూన్న విరహిణిలాగా వుంది కొండ. దీపాలలో కాంతి తగ్గుతోంది. బహుశా ఈ పాటికి, చెరువులలోని జలాలకు కాంతీ, నదులలోని జలాలకు ఉత్సాహమూ, సముద్రములోని జలాలకు ఉద్రేకమూ, విజృంభణా వస్తూవుంటయ్. పదిమెట్లు ఎక్కి కూలబడుతున్నాను. కిందనుంచి గోవిందా గోవింద అని భక్తుల కేకలు. కేకలు ముందు వినబడతై. తరువాత తలలూ, బుజాలమీద మూటలూ మనుష్యులూ కనబడతారు. ఆ చీకటివంటి వేళ, గాలిగోపురం ఎక్కుతున్నాను. త్రాహి త్రాహి అవుతోంది నాకు.

'పదిమెట్లు పైకెక్కి పల్లకుండా సూడు' అనీ, కొంగు పట్టుకొనీ కొండమెట్లు ఎక్కుతాను, అనీ అన్న యాత్రికుడు నాయడుబావ గుర్తొచ్చాడు.

*   *   *

కొండ ఎక్కాం. యాత్రలో 'మహామజా' వుంది. ఎరగనివారు, పరాయివారు, అపరిచితులు- ఆప్తబంధువులు అవుతారు. వెలుగు - చీకటి, బాధ—వ్యధ, ద్వంద్వాలు కరిగిపోతూవుంటై, తాత్కాలికంగా. కొత్త ప్రదేశం ఈశ్వర చిద్విలాసాన్ని ప్రదర్శిస్తుంది. చూస్తున్న ముఖాలలో మాలిన్యం క్షాళితమౌతూంటుంది. దాహం.

ఈ కొండమీద ఈ ప్రదేశంలో నీళ్ళెక్కడ దొరుకుతై?

యింకా కొంచెం ముందుకుపోవాలి! అక్కడ ఎవరో ధర్మాత్ములు చలివేంద్రం పెట్టారుట—అబ్బా-దాహం.

*   *   *

నీళ్ళు, గాలి లేకపోతే ఎంతకష్టం! ఎక్కడపడితే అక్కడ ఎప్పుడు పడితే అప్పుడు, తేలికగా దొరికే కారణాన నీరూ గాలీ మనకు తేలికఅయినై. ఏం తేలికయినై? తేలిక అయినట్లు కనబడి, ఒక్కొక్కవేళ, మన అల్పత్వాన్ని మనకు చూపిస్తూనే వుంటై - వాస్కోడిగామా, మొంబిజాక్ తీరానికి చేరినప్పుడు- మంచినీటికి కటకటపడ్డాడు.

అరబ్బీవర్తకులు ఎదిరిస్తే-తుపాకి బలంతో—బెదిరించి తనకు కావలసిన మంచినీటిని తెచ్చుకోవలసి వచ్చింది.

దాహం. అదుగో చలివేంద్రం!

క్రిందనుంచీ, బిందె బిందె చొప్పునా మంచినీళ్ళు తెచ్చి యిక్కడ-యాత్రికులకు, పాంథులకు ఇస్తున్నారన్నమాట! ఎంత ధర్మాత్ములు!!

* * *

నాటకంలోని వాక్యం పైనివాక్యం రసశిఖరానికి చేరుకున్నట్లు, మెట్టూ పై మెట్టూ ఎక్కుతున్నాను. అయినా వెంకటేశ్వరస్వామి యింత దుర్లభుడుగా, ఇక్కడే ఎందుకు వెలిశారో??

ఇక్కడ వెలవడంలోనే అందం వుంది. తనను నమ్మి, తనకోసం వచ్చేవారి గుండెనిబ్బరాన్నీ శ్రద్ధనూ ఒకచూపు చూస్తున్నారు స్వామి. పైగా-

పైగా?

పైగా కష్టపడి పొందినప్పుడు గానీ, మానవహృదయంలో శ్రద్ధ దృఢపడదు. ఆహా. ఏం చల్లగాలి! ఇక నడవలేం—తిరిగి వెనక్కిపోదామా? బద్ధక మాలిన్యాన్ని ఎగరగొట్టేస్తోందే చల్లగాలి! కాళ్ళు మళ్ళీ చచ్చుబడినై. ఈ కాస్త కొండ ఎక్కడానికే- నేను, అబ్బాణ్ణి యిలాగనుకుంటున్నానే— ఒక్క ఆశకోసం, ఒక్క ఆశయంకోసం, సౌకర్యాలులేని కాలంలో మహామహులు ఎలాగ భూప్రదక్షిణం చేశారో- ఏ ప్రబలకారణాల వల్లనో-??

సుగ్రీవుడు భూమిచుట్టపెట్టి రావడానికి వాలి భయం కారణం. స్ట్రాబో 'ఆసియా' అంతనూ చుట్టపెట్టి, ఆసియాభూగోళం వ్రాశాడే-అతనికీ భయమే కారణం అంటామా? అయివుండదు. అది సాహసయాత్ర. ప్రాణశక్తి అమితంగా విజృంభిస్తే,—చేసిన సాహసయాత్రలు అవి. మధ్య ఆసియా యాత్రాలనుకొన్న మార్కో-పోలో చైనాకు చేరేదాకా మనస్సునూ తరువాత తననూ తాను నడుపుకొన్నాడు. అష్టకష్టాలు పడ్డాడు. ఆశయాన్ని సిద్ధింప చేసుకున్నాడు. వుంటారు మహానుభావులు!!

అదుగో మోకాళ్ళ పర్వతం.

చిత్రంగా వుంది. ఇందాకటినుంచీ వేధించిన వికారం, విదాహం మటుమాయమైపోయినై. సూర్యుడు వచ్చి బలం ఇచ్చాడు కాబోలు. అరె! ఎంత అగాథం! ఈ రెండు కొండలనూ కలిపి వంతెన కట్టేశారిక్కడ పూర్వకాలం. ఇంతా ఎక్కి, ఇంతా దిగి, మళ్ళీ కళ్ళ ఎట్టఎదుటనే అంత కొండా కనబడుతూంటే-గుండె గుభేలుమని పోతుందేమో వారికి, ఆనాటి యాత్రికులకు! అయివుండదు. ఆనాడు ఇంత సుకుమారం బలిసిపోలేదు. పైగా, ఇబ్బందినే వుత్సాహశక్తిగా మార్చుకునే తత్వం వారికి యెక్కువ వుండి వుంటుంది.

బర్తాలోమ్యూ డయజ్ మున్నగువారు యిలాంటివాళ్ళే. తుఫాను గాలులు ఎడా పెడా దంచుతూంటే, తనతో వచ్చిన స్నేహితులు విసిగించి, వేధించి, యిక ముందుకురాము అని సాధిస్తూంటే, యాత్రలు చెయ్యలేదా వారు!

చేశారు. అంతకు అంత ఆనందాన్నీ పొందారు. కేప్ ఆఫ్ గుడ్‌హోప్ కనుక్కొన్నప్పుడు, డయజ్ ఎంత ఆనందం పొందాడో మరి! అన్నట్లు కేప్ ఆఫ్ గుడ్‌హోప్ అన్నది ఇప్పటిపేరు. అతను దాన్ని— 'తుఫానుల

అగ్రం' అన్నాడు. తరువాత, ఆ దేశాధిపతి—తుపానుల అగ్రంకాదు. శుభ సూచకాగ్రం, కేప్ ఆఫ్ గుడ్‌హోప్ అని పేరు పెట్టాడు.

అదుగో, గోపురం. ఏడుకొండలవాడా ! వెంకటరమణా, నీ దగ్గిరికి వస్తున్నా తండ్రీ!! దయజూడు !!

ఒహో. సూర్యకాంతి, ఎంత మెత్తగా వుంది? ఎంత దివ్యంగా వుంది! ఈ సౌందర్యాన్ని, మన ఊళ్ళో వుండి, మనం చూడలేమేం ??

అవునవును- అక్కడ పడివున్నప్పుడు, రకరకాలయిన వ్యధలు మనస్సును ఆవరించి వుంటయ్. ఇక్కడ అవి పైతొలగిపోయిన్నై. అంచేత మనస్సుమీద వ్యథా ఆవరణంపోయి-సహజ సౌందర్యాన్ని గ్రహించగలుగు తోంది.

అదుగో స్వామిగుడి. ఓః !

దేవతలు కట్టారో, దేవత లంతవారే కట్టారో ఈ దేవళాన్ని ! స్వామీ! జీవితయాత్రలో, నీ దగ్గిరికి యాత్రకొచ్చాను.

నాటకంలో అంతర్నాటకంలాగ. ఈ చిన్న యాత్రవలె ఆ పెద్ద యాత్రను గూడా సరిగ్గా సాగింపించు తండ్రీ !!

# 8

ఎంత సేపట్నుంచో వెతుకుతున్నాను. దొరకదు. గుర్తులో వుండక పోతుందా? అని ఎక్కడో ఇట్టే పెట్టివుంటాను.

ఎక్కడ పెట్టానో, ఎంత వెతికినా కనబడదు. ఎంత గింజుకున్నా జ్ఞప్తికిరాదు. అక్కర్లేని పుస్తకాలు, కాగితాలు, ఎన్నో ఎన్నెన్నో కన

బడతై. వాట్లమీద అప్పుడప్పుడు వ్రాసిన, గొంగళీ పురుగువంటి నా పేరుతో సహా.

స్వంత పేరునేనా ఇల్లాగ అనుకోడం?

ఆఁ. విసుగేసిపోయింది, ఆ పేరుతో.

చిన్నప్పుడు మప్తైకం అయిపోయి, మధురించిన పేరు, పలకమీద అదేపనిగా వ్రాసి చూచుకొన్న పేరు-పాఠం పుస్తకాలమీద నోట్సుపుస్తకాల మీద వెర్రిగా వ్రాసుకొన్న పేరు, గాఢనిద్రలో, పరధ్యానంలో గూడా, చెవిన పడగానే-ఉలిక్కిపడి, నాలోకి నన్ను రప్పించిన పేరు, కొత్త పుస్తకం, ముందుగా కొత్తకలం—చేతికి రాంగానే—ముందుగా వ్రాసుకొన్న పేరు—ముద్దుల్లో, మురిపాలలో, ముచ్చట్లో, ప్రేమలో, వివాహంలో, అప్లికేషన్లలో, చివాట్లలో, తిట్లల్లో, గౌరవాలలో, అసందర్భాలలో సుసందర్భాలలో, నానిన నాపేరు, శాశ్వతంగా నిలబడాలని కలయికన్న నా పేరు, చివరికి నాకే విసు గెత్తించింది.

అ—బ్బ! ఇప్పుడు, కావలసింది నా పేరు కానేకాదు.

పుస్తకం. అదీ ఎవరిదో గూడా — వారికివ్వాలి. ఎక్కడ పెట్టానో ఎంతకీ కనబడదు. పోయిందండీ అని నవ్వేస్తే సరిపోదు. మరీ! ఖాళీవస్తోంది, వెతికి వెతికి.

ఊఁ— తప్పుతుందా? ఇంకా ఇంకా వెతుకుతాం. ఏంచేస్తాం.

అమ్మయ్య. దొరికింది. ఇక్కడా పెట్టాను?

కాదల్లేవుంది. ఊహూ, కాదు.

ఇదింతకూ పుస్తకంలాగా కూడాలేదు. ఆహా. కాదు. ఎప్పటిదో, పాత ఫోటో! !

ఎప్పటిదో?

ఏదో గ్రూపు ఫోటో, ఎప్పటిదో?

ఆఁ. రామ్మూర్తి పెళ్ళినాటి ఫోటో.

అప్పుడు. ఇట్లా వుండే వాణ్ణన్నమాట. చాలాకాలం అయిందిస్మా.

*   *   *

రామ్మూర్తీ—పెళ్ళి. అంతా ఓ కల!

దేవుణ్ణయినా ధిక్కరించగల రామ్మూర్తి, ప్రేమకు లొంగి రాజ్యాన్ని పెళ్ళాడాడు. తల్లి వద్దని గోలకెత్తింది. అన్నగారు సుతరామూ వీల్లేదన్నాడు. స్నేహితులంతా భేష్ అంటే భేష్ అన్నాం. చివరికి రాజ్యాన్నే పెళ్ళాడాడు, రామ్మూర్తి బెంగుళూరులో.

కొట్ట కోలాహలంగా, శ్రీరామ పట్టాభిషేకానికి కిష్కింథా పురాగ్రహారికులు, అయోధ్యకు తరలినట్లు, స్నేహితులం అందరం బెంగుళూరుకు చేరాం, పెళ్ళి మాంచి ఉద్రేకాలతో గడిచింది.

అవును అవును.

వెళితే స్నేహితుడి పెళ్ళికే వెళ్ళాలి.

ఎంత అల్లరయినా చేయచ్చు. నిర్భయం. నిష్పూచీ. అంతా హాయి హాయి. ఆనందడోలిక.

*   *   *

ఎక్కడెక్కడి స్నేహితులూ కలుసుకోవచ్చు. పాత కబుర్లు ఎన్నయినా చెప్పుకోవచ్చు. తృప్తిగా ఊరంతా చక్కర్లు కొట్టచ్చు. కావలసినన్ని చిలిపిజట్టీలు పెట్టుకొని నెగ్గచ్చు. మనస్సులోని కిష్కింథకు కావలసినంత విహారం అది! స్నేహితులు అందరు మళ్ళీ ఎప్పుడు కలుస్తాం? ఎందుకు

కలుస్తాం? అందరితో తిరిగే, సంచరించే, సంవదించే హుషారు ఎక్కడ తట స్థిస్తుంది ? — బెంగుళూరులో అప్పుడు చాలా చిత్రం ఐంది. రామ్మూర్తి పెళ్ళి !

రామ్మూర్తి పెళ్ళికొడుకల్లే, సిగ్గుగా, ఏమిటోగా — ఆ పెళ్ళి వాతావర ణమే కొత్త గంధర్వలోకంగా లేదు. మామూలుగా ఎప్పటి సరదాతోనే వున్నాడు.

పెళ్ళయిన మర్నాడు, నేనూ, సూర్నాణా కలిసి బలామూరు బయలు దేరాం. సూర్నాణ అప్పటికే, మోతీబాబుతో స్నేహం చేసుకొన్నాడు. మోతీబాబూ బయలుదేరాడు మాతో. మోతీబాబుకు బెంగుళూరు కొట్టిన పిండిట. ఒక బెంగుళూరేమిటి, ఆ దేశ దిమ్మరికి-దేశం అంతా కొట్టిన పిండే, మహ అల్లరివాడూ.

సూర్నాణ మీసాలు వదేస్తూ బయలుదేరాడు. అసలే కొంటె. అందులో స్నేహితుడి పెళ్ళిలో అతిథి. బస్తీమీద సవాల్ అన్నట్లు బయలు దేరాడు. వెళ్ళి వెళ్ళి గోరీల తోట దగ్గిరికి చేరాం. పసుపు చల్లినట్లు ఎండ. గోరీల తోటలోని గులాబీపూలు విచిత్రంగా మెరుస్తున్నయ్. లోయ, లోయలో తోట, తోటలో గోరీలు, గోరీలచుట్టూ పూలమొక్కలు, పైని ప్రకృతి సాధించిన సూర్యుని మనోహరమైన కాంతి.

అక్కడ చేరగిలబడ్డాం.

ఆ వాతావరణంలో, ఎందరెందరు—యోధులు కావలసినవారు, ప్రేమి కులు, ఆర్తులు, తలిదండ్రుల బాసినవారు, ఎందరెందరు శాశ్వత నిద్రపోతు న్నారో—

ఆ వాతావరణంలో భయం మిగిలిన ఓదార్పు. ఓదార్పును మింగే పశ్చాత్తాపం వుంది. తెలియకుండా నా కళ్ళు మురిగి నీళ్ళు కారుతున్నయ్.

రేపు నేనూ ఇంతేగదా.

ఆఁ.

నేనూ ఇంతేనా? కాక, వాళ్ళ కొవ్వెక్కి, మనస్సు మదించి-అంతా నేను, నా మయం అనుకోటం తప్ప ఏముందీ?

కళ్ళలో నీళ్ళు.

సూర్నాణ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. అతని ముఖాన కన్నీరు ధార.

ఎన్నెన్ని పాపాలో చేశానోయ్ అన్నాడు.

చిన్నప్పట్నించీ చేసిన తప్పులు, మనస్సు రహదారి ఐతే—మైలు రాళ్ళలాగా నిలిచిపోయిన తప్పులు, హృదయశల్యాలు చెప్పేశాడు. చేసిన పాపం చెపితే పోతుందన్నాడు. పాపం, సూర్నాణ ఎంత హృదయం ఉన్న వాడు!

సాధారణంగా నలుగురూ గమనించని విషయాలలో గూడా, అవసరా నికి చేసిన తప్పుల్లో గూడా, అతని హృదయం గాయపడింది, పాపం.

మోతీనాబు గోరీలకేసే చూస్తున్నాడు. లేచి వెళ్ళి ఇన్ని గులాబీ పూలు గిల్లుకొచ్చాడు. పడుకున్నాడు. తనమీద గులాబీ రెక్కలు చల్లు కున్నాడు. ఏడ్చాడు. అతని మనస్సులోని వ్యథ అతను చెప్పాడు.

పొద్దెంత పోయిందో, తెలీదు.

తిరిగిపోవాలన్న యావేలేదు. సూర్యుడు వాలడం ప్రారంభించాడు. జారుడులోకి పోతున్నాడు. ఏదో వెలితి వ్యథ. బరువుగాలేచి పెళ్ళియింటికి పోయాం.

మా కోసం ఫోటో ఆగింది. ఆ ఏడుపు ముఖాలతోటే నుంచున్నాం.

అప్పటి ఫోటో.

జీవితం తలోదారినా పడేసింది. రామ్మూర్తి వెళ్ళిపోయాడు. రాజ్యం వెళ్ళిపోయింది. అప్పుడే—హుఁ—

ఏమిటో అంతా కల!! ఎవరెవరమో జీవిత మహాసత్రంలో కలిశాం.

ఇంతే.

# 9

ఆఁ— ఎన్ని చూశాం కాదూ. కొత్తోవింతా, పాతోక రోతాను-" అంటూ ఈసడించి పారేశాడు తాతయ్య. తాతయ్యకు కొత్త అంటే అసహ్యం. 'కొత్త' అంటే శీతాకోకచిలక లాంటిది. రెపరెప లాడుతుంది. పువ్వుమీదనుంచి పువ్వుమీదికి,—కొమ్మమీదనుంచి కొమ్మమీదికి, రెమ్మమీద నుంచి రెమ్మమీదకు దుముకుతుంది. అశాంతి (Restlessness) గా పరుగులెడుతుందీ శీతాకోకచిలుక. చూడటానికి ఎంతో బాగుంటుందీ - కానీ, ఏం లాభం! దాని ఆయుర్దాయం ఏపాటిదిరా, మూణ్ణాళ్ళ ముచ్చట గూడా కాదూ—అనంటాడు తాతయ్య. ఏదయినా సరే- పదికాలాలపాటు నిలిచేదిగా వుండాలి! అనంటాడు తాతయ్య.

నా దురదృష్టం కాబోలు. నాకు కొత్తదే ఎక్కువ నచ్చుతై. పూలు ఎక్కువకాలం ఉండవు. వాడిపోతై. ఎండిపోతై అని, పచ్చడి రుచ్చే పొత్రాన్ని పూలకన్నమిన్న అనుకోగలమా అని నా శోభ—కానీ, ఏం అను కొనీ లాభంలేదు. ఎప్పుడూ, తాతయ్య మాటలకే గౌరవం.

* * *

తాతయ్య అంటే—ఒక్క మానవ మాత్రుడు కాడు. ఆయన ప్రపంచంలో నిరంతరం సుప్రతిష్ఠితమై వుండే ఒక ప్రబలమైన భావానికి, ఆచారానికి ప్రతినిధి. 'పాతది అంతా బంగారం, కొత్తది అంతా కంగాళీ' అనుకోడంలో చాలా వీలుంది.

తొందరలేదు. ఆదుర్దాలేదు, ఆవేశంలేదు. ఆరాటంలేదు—నెమ్మదిగా, సరోవరంలోని చందమామలాగా, నిమ్మకు నీరెత్తినట్టుగా వుంటుంది.

నిజమే? ఆ సముద్రం క్షోభిస్తూన్నట్లు, పడుచు హృదయంలాగా తరంగితం అయివుంటుంది. ఆ అలల ఆరాటపు నృత్యకేళిమీద వెన్నెల. ఎక్కడ కక్కడికి చిన్న చిన్న దీపాలలాగ, వెన్నెల యువకులకు నచ్చుతుంది.

సరోవరంలో కదలిక లేకుండా, అద్దంలాగా వుండే జల శోభమీద, వెన్నెల పెద్దవాళ్ళకు రుచిస్తుంది కాదూ?

ఎక్కడి కక్కడికే—కొత్తా—పాతానూ!!

ఏం చెప్పినా పాతలో ఉన్న సొగసు పాతలోనూ వుంది.

అలవాటు పడివుంటాం. మానవజీవితమే అలవాట్లపుట్ట.

పాతఇల్లు. కావలిసినంత ఆలోచనలకు వీలుస్తుంది. అక్కడ తాతయ్య ఈ పని చేశాడు. అక్కడ నాయనమ్మ తులశమ్మకు పూజచేసుకొనేది. ఇక్కడ నాన్న తన చిన్నప్పుడు చదువుకొన్నాడట. ఇక్కడ అమ్మ అమ్మవారి పరంపెట్టుకొని పూజచేసుకొనేది. ఇక్కడ మావయ్య నాకు గుల్‌కంద పెట్టాడు. ఇక్కడ చిన్నప్పుడు నేను చదువుకొన్నాను. అక్కడ ఆవు దూడ వచ్చీరాని మునిపళ్ళతో గోంగూరమొక్కలు కొరికేది. ఇక్కడ ఆవుదూడ గంతులేసేది. అక్కడ ఆవుకు పచ్చిగడ్డి వేసేవాళ్ళం.

ఇక్కడ పచ్చీసు ఆడుకున్నాం. ఇక్కడ మా పిల్లవాడు తప్పటడుగులు వేస్తూ-పడి ఏడిచాడు. ఇలాగా ఎంతైనా, పాతకాలపు సంగతులు జరిగినవి, యథార్థాలు చెప్పుకోవచ్చు. కాళిదాసు అన్నట్లు-

ప్రద్యోతుడి ముద్దులకుమార్తెను, వాసవదత్తను వత్సరాజు ఎత్తుకెళ్ళాడు. ఆ రాజుగారి బంగారపు తాళ్ళతోపు ఇక్కడనే వుండేది. అని కథా కోవిదులు చెప్పుకుంటూ వుండడం అనాదిగా వుంది. మానవ సహజం.

కొత్త ఇంటికి ఈ ఆలోచనలతో పనిలేదు. ఇంకా ఎంతో జరుగుతుంది అనేదేతప్ప. కొత్తదంతా ముందు. పాతదంతా వెనక.

*   *   *

కనకనేనేమో, పాతవి, నలిగినదారి. కొట్టినపిండివి, అంతా బంగారంగా కనబడుతుంది. కొత్తదంతా, అనుమానాలబాపతువి —పిత్తలాటకంగా కనబడుతుంది.

పిత్తలాటకం? అంటే—?? ఓహో. అదా. పత్తల్ అంటే-ఇత్తడి. హాటకం అంటే బంగారం. ఇత్తడినితెచ్చి, బంగారం అనడం అన్నమాట, పిత్తలాటకం అంటే. ఐతే, కొత్తది అంతా—పితలాటకమేనా? అని.

ఈ ఆవిర్భవించిన కొత్తమాత్రం ఎక్కడిదీ? ఏ కొత్త అయినా పాతలోంచే ఆవిర్భవిస్తుంది. మానవులలాగా. మానవులలో కొత్తగా వచ్చేవాడికి లోకం స్వాగతం ఇస్తుంది-

ఆచారాలకు, ఆశయాలకు, అభిప్రాయాలకు

ప్రతిఘటనను ఇస్తుంది.

ప్రతిదేశంలోనూ, ప్రతిచోటా వున్నదే ఇది.

నిజమేకానీ-

ఈ కొత్తనుగూడా మింగే, మరో కొత్త వచ్చిపడితే—??

ఈ కొత్త పాతలో కలిసి, మరోకొత్తదాన్ని ఢీకొంటుంది.

# 10

సాహాస మింకెవరు?

సంపదెవరోనంటి??

అని తన సహచరి, ప్రాణాధికురాలు యెంకి తనకు దూరాన వున్నప్పుడు యేటిదరిన తానున్నప్పుడు, నాయకుడు నాయిడుబావ వ్యథపడుతున్నాడు. అలాగే, సుకుమారమైన హృదయంగల యెంకికూడా, మరో సందర్భంలో-

'వొక్కతెను నాకేల వోపజాలని సుకము'

అని మూల్గుతుంది.

ఎవరో ఒకరు, ముఖ్యంగా తమకు కావలసినవారు, తమతో వుండి, సందడి చేస్తూంటేనేగానీ, తోచదా? అని. తోచదు.

ఎవరో అతీతులు, గుండెనిబ్బరం గలవారు, ఏకాంతంలో వుండవచ్చు. గుహలలో, చీకటిలో, గుడ్డివెన్నెలలో, ఏకాకులై—మౌన సముద్రపు ఆటుపోటులకు తట్టుకొంటూ నివసించవచ్చు. కాని, ప్రజాసామాన్యం అలాగ ఏకాకితనమును భరించగలరా? అని.

మనలోమాట. గుహలలో, కొండచరియలలో, హిమాలయాది ధ్యానానుకూల ప్రదేశాలలో వుండేవారు మునులు. ఒక్కటూ, ఏ ఇతర సంపర్కమూ లేకుండా వుండగలిగేవారా? అని. వారూ ఏకాకిగా వుంటారని తోచదు. నిరంతరమూ వారితోపాటు, వారి ధ్యేయమైనవి, భావనారూప దైవం వారిపక్కనే వుండడం సహజం. మనసా అట్టి సాన్నిధ్యం కల్పించుకొనే వారూ వుంటారు.

ఏ ధ్యానమూ, ఏ యోగమూ, ఏ భావమూ, ఏ సహవాసమూ లేకుండా ఎవ్వరూ వుండరు. వుండలేరేమో అనిపిస్తుంది. ఎందేతో?

తొట్టెలో ఉన్న శిశువు, ఏ గిలక్కాయనో, ఏ చెట్టుకొమ్మనో చూస్తూ వుంటుంది. తప్పటడుగులు వేసేనిద్ద- తనవాళ్ళు చేస్తున్న పనులు తానూ చేయాలని సతమతం అవుతూంటుంది. ఈడువస్తున్న బాలబాలికలు తమ తమ నేస్తాలతో కలిసిపోతారు. ఆ తరువాత చదువుసంధ్యలు, పెళ్ళిపేరంటాలు, సంసారబాధ్యతలు, వృద్ధాప్యంలో కాలక్షేపాలు, ఎప్పుడూ మానవుడికి—ఏదో ఒక సావాసం అవసరం.

* * *

సావాసంలో చాలాశక్తి వుందేసుమీ! సావాసం చెయ్యటానికి కనీసం ఇద్దరు వ్యక్తులు అవసరంగదా. ఆర్నెల్ల సహవాసం చేస్తే—వారు వీరు అవుతారని అనుభవసారం గదా—మారిపోతే!

ఏం మారిపోతే-?

సహవాసంలో ఉన్న మాధుర్యమే అది. ఒకరిమీద ప్రేమ, అభిమానం, వాత్సల్యం, దయ, ఆపేక్ష, మనస్సులు కలవడం ఇవేవీలేనిదే సహవాసమే లేదు. ప్రేమాభిమానాలు కలిసిపోయినవారు, వారూ వీరూ అనే తేడా ఎందుకు పెట్టుకొంటారు?

కలిసిపోతారు. అలవాట్లు, అభిరుచులు దగ్గర్నుంచీ, మార్పు వస్తుంది.

అవసరానికి మైత్రిపాటించడం, లోలోపల స్వయంపాకాలూ, కృతఘ్నత, కుహకమూ కుట్రా, పబ్బం గడుపుకోవడం ఇలాంటి సందర్భాలలోని సావాసంలో, ఎవరికివారే గానీ—

నిక్కమైన మైత్రి వున్నప్పుడు, కష్టసుఖాలు వారివి వారికీ, వీరివి వీరికీ అనుకోవడం కల్ల.

హృదయనిర్మాణంలోనే, సానుభూతిని, ప్రేమను ఏకమైపోవటాన్ని గూడా కలిపివేసింది ప్రకృతి.

నిజమే స్మా.

ఐతే- వ్యక్తి వ్యక్తి సహవాసం చేస్తేనే—ఇలాగ ఐక్యమైపోతారే—గుంపులకు గుంపులు, జాతులకు జాతుయి సావాసం చేస్తే-??

తమాషాగానే వుంటుంది.

కొత్తలో మర్యాదా, ప్రేమా చూపుతారు. కొస్తకూ కూస్తకూ కీచులాడుతారు. అసహ్యించుకుంటారు. ఎత్తు పై ఎత్తులు వేసుకుంటారు. పోరాడుకుంటారు. విధి శాసనానికి కట్టుబడి, ఉల్టా సీదా అవుతూంటారు. చివరికి, ఆచారాలు, అలవాట్లు, ఆలోచనలు, ఇచ్చిపుచ్చుకోడాలు, రక్త సంబంధాలు కలుస్తయ్. కొత్తసంఘం, కొత్త నాగరికత ఏర్పడుతవి. కొత్తజాతి తయారు అవుతుంది.

మనదేశమే చూద్దాం:

అదిమనివాసులు, ద్రావిడులు, ఆర్యులు, సిథియన్లు, గ్రీకులు, పరిషియనులు, క్రైస్తవులు ఇంతమందరు ఇక్కడ కలిసి నివాసం చేశారు. విధిశాసనంవల్ల. అమ్మో. విధిశాసనం బలీయమైంది.

యుద్ధాలు చేసుకున్నారు. కలిసిపోయారు. వారి నాగరికత, వీరికి అచ్చింది. వీరి అలవాట్లు వారికి అచ్చినవి. కొత్తవికాసం, కొత్తసంస్కృతీ వికసించినయ్—కొత్తరుచులు వచ్చినయ్. కొత్త-పాత కలిసి విలీనంచెంది నుకొత్తరూపు సవరించుకొనేది. ఎక్కడైనా—ఎప్పుడైనా మంచి మిగులుతుంది. అదే ప్రకాశిస్తుంది.

మహాకవి అన్నట్లు, మంచి చెడ్డలు జగతిలో రెండే—! మిగిలేవీ, నెగ్గినిలబడి వెలిగేవీ!

చిత్రమే స్మా!

అవును. దీర్ఘంగా ఆలోచిస్తే, సాహసం వల్లనే, సంపర్కం వల్లనే కొత్త–పాతల సంఘర్షణ, సామరస్యాలవల్లనే — జవమూ జీవమూ తారుణ్యమూనూ, మనిషికైనా, జాతికైనా అనిపిస్తుంది. కాదూ!

# 11

ఉన్నట్టుండి రివ్వున గాలి.

మాఘమాసంలో సోమరిగాలి తగిలీ తగలనట్లు, సువాసన వేసీ వేయనట్లు తీయని మల్లెపూలలాగా, సన్నని జాజి పరిమళంలాగా పలకరించే సున్నితమైన గాలి కాదు!

ఆడుకుంటూన్న పిల్లవాడిలాగా రివ్వున గాలి వచ్చి రౌడీలాగా దుమారం లేపింది.

ఆహాహా,

ఎంత హాయిగా వుంది! ఉడికి ఉడికి ఉన్న తనువులు, మనస్సులు అమ్మయ్య అనుకోవా, నాలుగు చినుకులు గూడా పడితే!

సన్నని చినుకులు!

కాటుకకన్నుల చిలిపి చూపులవంటి చూపులు, కవ్విస్తూన్న కాంత చూపుల తూపులవంటి చూపులు....తొలి రోజుల ప్రణయ వేగంలాంటి గాలితో—చినుకులు—వర్షం!

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి వర్షం!

వర్షానికి ఎంత మొహం వాచి ఉన్నాం! ఇన్నాళ్ళూ చల్లదనంకోసం పడి చచ్చాంగదా.

అయ్యో,

ఆగిందేం జల్లు! ఆగలేదు! ఆగటం కాదిది. ప్రాణ స్నేహితునిలాగా వచ్చి పలకరించిన వాన, వట్టివేళ్ళ సువాసనతోటి కుండలో చన్నీళ్ళలాంటి వాన. హాయిఐన వాన, కొంటి కోణంగి చేష్టలు చేస్తోంది!

మళ్ళీ జల్లు.

చందమామ ముందు చంద్రకాంత శిలలాగైంది మనస్సు. వాన! తొలకరి వాన!

పంచాంగాలు పార చూస్తాం.

రోహిణీ కార్తెకు రోళ్ళు బద్దలు కావు; కాని అట్లా అనుకుంటాం ఆ ఎండ ధాటికి.

గాలి మార్పులు గమనిస్తాం.

యిళ్ళన్నీ దుమ్మూ, ధూళితో వుంటే సహిస్తాం.

యిళ్ళమీదా యిళ్ళల్లోనూ ఆవిర్లు తేలితే—ఓరుస్తాం.

ఆకాశం చల్లబడితే చూచుకుని—ఆరుబయట, అమాయికంగా నిద్రిస్తాం!

ఎంత నిద్ర పట్టినా, రాత్రంతా నిద్రలేక పొద్దున్నే వాపోతాం!

ఉన్న వేంద్ర చాలదన్నట్టుగా, మరింత ఘాటుగా ఆవకాయ పెట్టుకుంటాం, తింటాం! ఆవకాయ ఆంధ్రుడికి జాత్యన్నం! జాత్యన్నం అమృతానిగ్గూడా పైది అని శ్రీకృష్ణదేవరాయల వారంతటివాడు ఢంకా బజాయించి మరీ చెప్పాడు!

కొత్తావకాయ ఘాటు, కొబ్బరినీళ్ళ తేటలతో కాలం గడుపుకొంటూ పరాయి పంచలపడి కాలం గడుపుకొంటూన్న పరమాభిమానిలాగా కాలం వెళ్ళతీస్తూంటే—వాన.

వాన

చుట్టంలాంటి వాన.

ప్రియురాలిలాంటి వాన.

ప్రాణ స్నేహితునిలాంటి వాన!

వాన, అమ్మయ్య, వాన.

ఇక నకనక లాడిపోతూన్న మొక్కలు నవనవ లాడుతై! ఫక్కున నవ్వుతై! జీవబలానికి పుష్టి కలిగి—కొత్త పెళ్ళికూతుళ్ళలాగా కలకల లాడుతై!

వాన వచ్చింది.

మహారాజులాగా వచ్చింది వాన.

ఏనుగంబారీమీద కూచుని జమీందారు, జమ్మి కొట్టడానికి వెళ్ళేప్పు డుండేంత ఠీవితోనూ వచ్చింది వాన.

మా చిన్నప్పుడు చల్లపల్లి రాజా, మహారాజులాగా ఠీవిగా, శివగంగ నుంచి ఏనుగెక్కి ఊరేగేవాడు! రాజా ఏను గెక్కేప్పుడు చూడాలని మాకు వెర్రి ఆశ ఉండేది! ఆ శివగంగ ఇసకలో చిన్నతనపు ఉత్సాహంతో ఉద్రేకంతో జీవితమే ఆట అన్నంతగా సరదాగా తిరిగేవాళ్ళం!

శివగంగ మా మచిలీపట్నం దగ్గిర చిన్న ఊరు! చల్లపల్లి రాజాలు అక్కడ బ్రహ్మాండమైన ఊరు కట్టించారు! తిరువన్నామలైలోని అరుణా చలేశ్వర దేవాలయంలో గుడిపాటి వెంకట చలంగారితో తిరుగుతూన్నప్పుడు, మా శివగంగ గుడే గుర్తుకు వచ్చింది! 'గుడి' అని చెప్పుకోతగ్గ గుళ్ళు అవి!

శివగంగ గుడిలో అమ్మవారు, మహిషాసురమర్దని! చల్లని తల్లి.

పుష్పగిరి స్వాములవారు అంతటివారు ఆనాడు శివగంగ మహిషాసుర మర్దిని ప్రభకు జోహారు చేశారట!

మహిషాసురమర్దినికి ఉత్సవాలు జరుగుతై.

చివరి రోజున ఏనుగంబారీ.

పెద్ద ఏనుగుమీద అంబారీ వేస్తారు! అమ్మవారిని కూచోబెడతారు. చల్లపల్లిరాజా, అంకినీడు ప్రసాద్ బహద్దూర్ ఏనుగ కుంభస్థలంమీద కూచునే వారాయన. ఆయన బి. ఏ. ముట్నూరి కృష్ణరావుగారికి సహాధ్యాయిట.

వెడల్పయిన ముఖం, పెద్ద కన్నులు, సొంపైన మీసాలు, తెల్లటి రవ్వల దుద్దులు, జరీ తలపాగా. ఆయన అంబారీ ఏనుగుమీద కూచుని జమ్మి కొట్టటానికి బయలు దేరేవాడు—ఆయన తరువాత శివరామప్రసాద్ దొరా అంబారీ ఎక్కి జమ్మికని వెళ్ళేవాడు.

అరమైలు పొడుగున జనం వుండేవారు కిటకిట లాడుతూ. టింగ్ టంగ్‌మంటూ గంట ధ్వని చేస్తూంటే కాళిదాసు చెప్పిన రఘు మహారాజు నడకలాగా ఏనుగు నడిచేది. వేలాది ప్రజలు పాల్గొనే ఉత్సవంలో—నా చిన్నప్పుడు నేనూ మైమరచి తిరిగేవాణ్ణి. చెల్లాయి నాతో శివగంగ వచ్చేదికాదు! చిరుతిండి తినేది కాదు! బిగ్గరగా నవ్వేదికాదు! ఓ పట్టాన నవ్వదు చెల్లాయి!

అది నవ్వాలనీ, నవ్వించాలనీ నాన్నకు!

తాయిలం తెచ్చి యిచ్చినా, మిఠాయి పొట్లం పట్టుకొచ్చి అచ్చంగా దానికే యిచ్చినా, దాని చేతికి నాన్న గడియారం కట్టినా—ఉహుఁ—ఎప్పుడోగాని నవ్వేది కాదు!

ఒయ్యారంగా, ఒప్పుల కుప్పలాగా, సున్నితంగా సుతారంగా నవ్వేది! అన్నట్లు అమ్మాయికి మెల్లకన్ను. మెల్ల కన్నుందా అదృష్ట వంతురాలు అనేవాళ్ళు దాన్ని. కొత్త పరికిణీ చూస్తే నవ్వేది.

పూలు అన్నా, కొత్త గుడ్డలు అన్నా, పసిపిల్లలకుండే ప్రీతి పెద్ద వాళ్ళ కుండదెంచేతో....అందులోనూ ఆడపిల్లలకు!

ఆడపిల్ల నవ్వితే అందం.

మా చెల్లెలు నవ్వితే మా నాన్న నవ్వినట్లుండేది. పూజచేస్తూ హారతి ఇచ్చేప్పుడు అమ్మ ముఖం వున్నట్లుండేది.

చెల్లాయి పెద్దదైంది. పెద్దదై కళ్ళకు కాటుక పెట్టుకొని, శుచిగా శుభ్రంగా నడిచేది—అచ్చు మా అమ్మలాగే వుండేది.

ఈ తొలకరి చినుకులకు మా అమ్మాయి ఏమనుకుంటూందో! మా పసి మేనల్లుడితో ఆడుతూ, ఆడిస్తూ, మాటలు చెప్తూ, పూట పూటకూ, వాడో కొత్త అల్లరి చేస్తుంటే—మురుస్తూంటుంది.

వాడు మకురుపట్టు పట్టితే—

ధడుసుకుని నిద్ర పోకపోతే—

దిష్టి తగిలితే—

ఏమో, దూరాన పడి వున్నది!

సన్నని వాన జల్లులు మీదపడుతుంటే—దుప్పటి బిగ్గ కప్పుకొని పిల్లవాణ్ణి గుండెల దగ్గిరికి లాక్కుని అలాగే నిద్ర పోతోందేమో!

లేక, చిన్నప్పటి ముచ్చట్లు చెప్తూందేమో.

నున్నగా దువ్వుకున్న తల తడిసి పోతుందనిగాని, తొడుక్కున్న దుస్తులు తడిసి పోతాయి అనిగాని—చేతిలోని పుస్తకం ఏమయి పోతుందో అనిగాని అనుకోకుండా తొలకరి వానలో నుంచోడం ఆనందం.

ఎండిన నేలమీద నవోదబిందువులు పడినప్పుడు వచ్చే నేల ఘుమఘుమకు — చింపి చాటల్లే ముఖం కావడం ఆనందం. ఆ కాస్త వానా వెలిశాక, ఉక్క పోస్తూంటే—తెకతెకలాడుతూంటే — ఇదవడం ఒక ఆనందం! మబ్బులకేసి చూడడం, మబ్బులు—మూట భుజాన పెట్టుకునడిచే యాత్రికులమల్లే, నెమ్మదిగా వెళుతూంటే, కిటికీలో కూచుని చూట్టం ఒక సంతోషం. ఆ మబ్బులే— బలిసి, ఇంతింతై వటుడింతయై అన్నట్లు పెరిగి, జోరున ఖోరున వర్షిస్తూంటే—చెవులు గడియలు పడేటట్లుగా ఉరుములా మెరుపులా వస్తే— ఉలిక్కిపడి, 'అ-బ్బ!' అ-బ్బ అనుకోడం ఒక ఆనందం.

ఇలాంటి ఆనందాలు తన చిన్న కొడుక్కి చెప్తూందేమో అమ్మాయి!

వాన జోరుగా కురిస్తే—

కాయితాలతో పడవచేసి, వాన నీళ్ళలోకి వదులుతూ

పిల్లవాడు కిలకిలా నవ్వితే—తనూ నవ్వుతుందేమో అమ్మాయి లేక,

వాళ్ళ పెంకుటింటిలో నిలబడి,

ఇల్లంతా బురద అయిపోతోందని—

ఇదుగో, అక్కడ కురుస్తోంది, అక్కడ కారుతోంది. చూరు దగ్గిర బాగు చేయించుకోవాలి. ఓసారి పెంకులు తిరిగి నేత నేయించుకోవాలి అని సంసార తాపత్రయాలు పడుతోందేమో అమ్మాయి!

మరి నాలుగు రోజులుపోతే — శ్రావణం వస్తుంది.

నాలుగు మంగళవారాలూ, శుక్రవారం, పేరంటానికి పోతారు ముత్తయిదువులు.

జేబురుమాలులో తడిసెనగలు మూట కట్టుకుని, పిల్లాణ్ణి చంకన ఎత్తుకొని అమ్మాయి యింటికి వస్తూంటే, చూడాలని వుంటుంది నాకు— ఊఁహూ పడనే లేదు.

అమ్మయ్య!

నేల ఘుమఘుమ లాడుతోంది.

తడిసీ తడియని నేల ఏం పరిమళిస్తుందని!

తొలకరి చినుకులు పడగానే—

ఎండి ఎండి ఉన్న నేల. గుబాళిస్తుంది. నిట్టూరుస్తుంది. తన హృదయ మాధుర్యాన్ని బయట పెడుతుంది! మత్తెక్కిస్తుంది.

ఆ మాధుర్యం ఎంత హాయిగా వుంటుంది!

వాన చినుకు భుజంమీద పడడం, నెత్తిన నాలుగు చినుకులు పడడం.

ఉత్తరీయం కప్పుకొంటూ గబగబా నడవడం, ఎంత సరదాగా వుంటుంది!

ఎండి బీటలు వారిన నేలను, కాశ్మీర్ పచ్చశాలువా పరిచినట్లుగా చేయబోతోంది ఈ వాన.

చదువుచెప్పే గురువువలె దయగా వుంటుందీ వాన.

సగం మన శ్రద్ధా, సగం గురుబోధలాగ సగం ఆరు బయట పడకా, సగం వసారాలో పడకానూ. అప్పుడు!

స్తిమితంగా ఓ చోట ఉండనీయదు, ఆ తొలకరి వాన.

ఉక్కిరి బిక్కిరి చేస్తుంది.

ఆశపెట్టి, ఆడిస్తుంది తొలకరి వాన.

యింట్లోనే పడుకుందాం అనిపించి ఆరుబయటగాని, వసారాలోగాని చిచ్చికొడుతుంది చివరికి.

ఇంతకూ, వెక్కసమయిన ఎండ దెబ్బనుంచి హితవైన దారికి పట్టిస్తుంది కొత్త చినుకు! అవునవును. ఏ కొత్త రాకడ మనస్సును ఊరించదూ? చలించి, జ్వలించే హృదయం ఉండాలిగాని.

# 12

"అన్నయ్యా, ఈ మధ్య నీ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చి చాలా రోజులయింది! కారణం తెలియదు ! బద్ధకమే కాదని అనుకుంటాను!" అంటూ మా చెల్లెలు ఉత్తరం వ్రాసింది.

"అన్నయ్యా" అన్నమాట, ఆమె చేతి దస్తూరీలోంచి నాచులోంచి పద్మంలాగ వికసించి, విహసించి, వినిపించింది!

'అన్నయ్యా!' అని ఎవరు అంటున్నా, అనుకుంటూన్నా, నాకు మా తమ్ముడూ, మా చెల్లెలూ గుర్తుకొస్తారు. మా తమ్ముడు, అన్నమీద ప్రేమను నాపై కుమ్మరించాడు! అన్న ఓ చిన్న దైవతమూర్తి అన్నట్లు చూశాడు! నన్నెవరన్నా అవమానిస్తే, తానూ గిలగిల్లాడాడు! నాకు ఏదన్నా సంతోషంవస్తే, తానూ సంతోషించాడు!

అత్తవారింట్లోకి వెళ్ళేదాకా, నాకు ఏ కొత్త సుఖం వచ్చినా? మా తమ్ముడు, మా చెల్లెలు అనే వుండేది !

తమ్ముడు చూపించిన ప్రేమను అజ్ఞానంవల్ల, లేమివల్లా తెలుసుకోలేకపోయాను! అజ్ఞానపు దెబ్బకయినా విరుగుడు వుందిగాని, లేమివల్ల కలిగే దెబ్బలకు విరుగుడు లేదు! జన్మ మారాలిసిందే. మళ్ళీ ఒక అమ్మకు బిడ్డగా

జన్మించేదాకా 'లేమి' ఏడిపిస్తూనే వుంటుంది! ఏమో, అప్పుడూ విడవదేమో !

వయస్సు వచ్చి, బిడ్డా పాపా కలిగి, ప్రేమ రెచ్చి, కుమారుడివల్ల చిన్నతనం గుర్తు కొచ్చినప్పుడు, తమ్ముడూ, చెల్లెలా మళ్ళీ మనోరంగం మీదికి వచ్చారు! మనస్సు విధిలేక వాళ్ళకోసం ఏడ్చింది! వాళ్ళు, దూర దూరంగా తప్పుకొన్నారు!

'అన్నయ్య' అని వుండకపోదు! వుంటుంది! ప్రేమబంధం సళ్ళిస్తుంది కాబోలు-వుత్తరం అయినా వ్రాయడు తమ్ముడు. తమ్ముడికి ప్రేమ-తమ్ముడి పిల్లలకు అపేక్ష! కాని, 'నువ్వు ఎట్లావున్నావు' అని పుష్కరానికి ఓ ఉత్తరం అయినా వ్రాయరు!

ఇంతకాలానికి చెల్లెలు వుత్తరం వ్రాసింది.

పరాయిదానివలె, తనయింట్లో తానువుంటూ, తన కాపురం చేస్తూండడం వల్లనో ఏమో--తోబుట్టువులలో ఆడబడుచులకు అపేక్ష వుంటుంది. వోపట్టాన పోదు. తమ్ముళ్ళకు చిటికిలో హూష్కాకీ అయి ఎగిరిపోతుంది ప్రేమ! ఎవరో వివేకవంతులు గాని, పెద్దవాళ్ళైనాగూడా ప్రేమను నిలుపుకోరు!

అమ్మాయి యింతకాలానికి వుత్తరం వ్రాసింది! అందులోనూ ఆడబడుచు! తప్పులు నామీదకే మృదువుగా తోసేసింది!—పెద్దకాటుక కన్నులతో వంటింట్లో పిల్లాడితోపాటు కూచుని కబుర్లు చెప్పినట్లే వుంది నాకు ఆ వుత్తరం చూస్తుంటే- పచ్చని ముఖం, ఎర్రని కుంకుమబొట్టూనూ.

నాకు చిన్నప్పటినుంచీ అంతే! పచ్చని ముఖం, ఎర్రని కుంకుమబొట్టు-కనిపిస్తేచాలు మా అమ్మ ముఖం గుర్తుకొచ్చేది! బీదతనంవల్ల పేదల సౌందర్యానికి విలువ ఉండకపోయినా, అందమైన ముఖం మా అమ్మది. 'అందం' అనేదానికి నా ప్రమాణం మా అమ్మ ముఖమే-!

తరువాత మాచెల్లాయి! చెల్లి అందం అయినదే. పేదరికంవల్ల ఆ అందం ధగధగాలాడి కనబడదు! అదీమంచిదే! సంసార్ల అందచందాలు వీధినపడేవా మరి!

ఇవాళైనా చెల్లాయికి ఉత్తరం వ్రాయాలి!

"చెల్లెలు" అనేమాటలో ఎంత మాధుర్యం!

"అమ్మ" అనేమాటలో ఎంతలో అమృతం!

చిన్నతనంలో తెలియదుగాని, అమ్మ కోప్పడ్డా అమృతమే మరి!

ఇదంతా మన భావనేనా?

లేక ఆ మాటల్లో వుందా?

మాటలో వుండేదేమిటిగాని, ఆ మాట వినగానే, సుతిమెత్తని హృదయానికి కలిగే స్ఫురణల్లో, అనుభవాలలో వుంటుంది అమృతం! తన తల్లిదండ్రుల ముఖం తానెరుగని దౌర్భాగ్యుడి బాధ— పాపం, ఆ కొరతను ఎవరూ తీర్చరు. తీర్చలేరు!

మిత్రుడు భావరాజు నరసింహారావు, పెద్దవాడై — ప్రయోజకుడై ప్రతిష్టావాచకుడై —తనతండ్రి ఫోటోకోసం గాలించాడు! తనతండ్రి భావరాజు నారాయణమూర్తి ఆనాటి మంచినటుడు. వాళ్ళకో నాటకం కంపెనీ వుండేది. ఆ కంపెనీ మెంబర్లను పట్టుకొని బ్రతిమాలి, బామాలి గ్రూప్ ఫోటోలు సంపాదించాడు. కాని, అతని తండ్రిని గుర్తుపట్టుకోడం పడలేదు! కొడుక్కి తండ్రి పేరు పెట్టుకొని, అంతతో సంతోషిస్తున్నాడు!

తల్లీ తండ్రీ అంటే- ఇది మరి!

అనవసరంగా కోప్పడీ, తిట్టీ కొట్టీ — తండ్రి దూరం అవుతాడు ఒకొక్కచోట! అయినాసరే - తండ్రి, తండ్రిపేరు - మనస్సును పట్టుకొనే వుంటయ్!

ఆఫీసులో ప్రూఫులు దిద్దుతున్నాను. అందులో ఎక్కడో, ఎవరి వ్యాసంలోనో, ఎవరో ఆంజనేయులు అనేపేరు వచ్చింది. నా గుండెల్ని ఎవరో పట్టుకొని ఆపేసినట్లయింది! గుండె గుబగుబలాడి, కళ్ళనీళ్ళు కారి ఎందుకో తెలీనిబాధతో గిలగిలలాడాను కొంతసేపు—

ఏమిటో, తెలిసే తెలియని అనుబంధాలు వుండి వుంటాయి కాబోలును.

"ఏంరా అన్నయ్యా !"

కోపం పట్టలేనంతగా వుంది కంఠంలో! ఎదురుగుండా నిలబడింది ! పెదిమలు కోపాన్ని కక్కుతూన్నయ్! ఆ పచ్చని బుగ్గలమీద నేను కొట్టిన చెంపకాయ-కుంకుమ ధారలలాగ మెరుస్తోంది! నా తప్పు నాకు తెలిసి, కళ్ళ నీళ్ళు వచ్చినై!

"ఏం రా, యెందుకురా కొట్టావు !" నిగ్గతీసి అడుగుతోంది అమ్మాయి!

ఏమని చెప్పను? ఏదో పిచ్చికోపంవల్ల మూర్ఖంవల్ల కొట్టాను!

ఎందుకు కొట్టానా అని నాలో నేనే కించపడుతున్నాను మరి!

తప్పుచేసినవాణ్ణి, ఛప్పున ఛప్పున, అప్పటికప్పుడు నిగ్గతీస్తే-

లాభంలేదు. తెలిసినా నిగ్గతీసి అడుగుతాం!

'మరి దస్తూరీ సరిగ్గా ఎందుకు నేర్చుకోవు!'

రామరామ! అన్యాయంగా బుకాయిస్తున్నాను!

'ఏం నేర్చుకోకపోతే—' అంటుందేమో ! అంటే ! మా అమ్మాయి అనలేదు! నా భార్య అందిగాని, నా భార్యను చదువుకోమని కోప్పడితే 'ఏం చదువుకోకపోతే—నాకు చదువురాదు. నన్నిక ఏడిపించవద్దు !' అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ! ఆడదాని కన్నీరు భరించలేను నేను;

"కలకంఠి కంటి కన్నీరొలికిన సిరి, యింటనుండ నొల్లదు సుమతీ!" గుర్తుకొచ్చి అక్కడితో ఆ ప్రయత్నం మానేశాను !

చెల్లెలు 'ఏం, దస్తూరీ నేర్చుకోకపోతే—' అని అంటుందా?

మా నాన్న దస్తూరీ బాగుండదు ! అంచేత, తన కొడుకు దస్తూరీ అయినా బాగుండాలని, నన్ను రాచి రంపాన పెట్టారు! దస్తూరీ ఎంత కాకి బికిగా వుంటే, అంత అదృష్టం అని మా నాన్నకు తెలియదు కాబోలు ! గొప్పవాళ్ళ దస్తూరీలు కాకిబికిగా వుంటాయి.

ఎదురుగుండా గాంధీగారి పటం వుంది ! గాంధీగారి ఆత్మకథను మేం యింట్లిపాటీ తెనుగులో చదివాం! గాంధీగారు దస్తూరీ ప్రాముఖ్యాన్ని నొక్కి చెప్పారు! అదీ నా ధీమా. ఇప్పుడు అనిపిస్తుంది! వొక మూర్ఖుడు తన పంక్తులను అడ్డంపెట్టుకొని, తన తోబుట్టువును అన్యాయంగా కొడతాడని, ఆ గాంధీగారుగానీ, అంత అందంగా తెనిగించిన వేలూరి శివరామశాస్త్రి గారుగానీ, అనుకునైనా వుండరుగద.

'నేర్చుకుంటున్నాను. ఒక్కసారే సరిగ్గా వస్తుందా ఏం దస్తూరి?' అంది ఆమ్మాయి !

సమాధానంలేదు! తలవంచుకున్నాను ! నిన్ను కొట్టడం, నా తప్పే నమ్మా అనాలి అనిపించింది! అహంకారం, అభిమానం అడ్డం వచ్చింది.

నేను కొట్టిన బుగ్గలు చూచాను.

> "సిందూరం, రక్తచందనం
> బంధూకం సంధ్యారాగం
> పులి చంపిన లేడినెత్తురూ !"

ఈ 'పులి చంపిన లేడి నెత్తురు' అన్నమాట శ్రీశ్రీ హృదయం లోంచి వ్యక్తం కావడానికి – శ్రీనివాసరావు కళ్ళారా చూచిన ఎన్నెన్ని

అన్యాయాలూ, దుర్భర దౌర్బల్యాలూ కారణాలో! అందుకే అతను మహా కవి !

మన మనస్సుకు సరిగ్గా చేతకాక, గొగ్గి గొగ్గిగా, గొణుగుడుగా తల పోసిన భావాలూ, మాటలూ, మనకు స్పష్టంగా సొగసుగా చూపిస్తారు కవులు.

కవులేమిటి, కళాస్రష్టలు, యోగులు, మునులు, రుషులు అందరూ ఒకటే! అగరు వత్తులలాగా తాము కాలిపోతూ ఇతరులకు పరిమళాన్ని ప్రసాదిస్తారు!

నిజమే కాని!

నిజమే కాని—?

నిజమే కాని, దగ్గిరికి చేరితే యోగులూ, కవులూ, కళాకారులూ, అల్లుళ్ళూ, అధికారులూ వెక్కసం వేస్తారంటారు! పోనీ—దగ్గరికి పోనేవద్దు! ఇంతకూ, వారి వారి అనుభవామృతాన్ని మనం స్వీకరించడం మాని, వారిని పూజిస్తే మాత్రం ఏం విలువ వుంటుంది ? దూరంగానే వుంటూ వారి వారి ప్రసాదాన్ని మనం అనుభవిస్తే సరి—నిష్కృతి!

అదీకాక, ఏదో కోరికతో ఎక్కడికి పోయినా, ఆశాభంగమూ, బాధ, కీచులాట తప్పదు. దూరంగా వుంటే ఏ బాధాలేదు.

అందుకేనేమో, సూర్యచంద్రాదులు దూర దూరంగా వుంటూ మనకు మేళ్ళు చేస్తున్నారు.

తెల్లవారుఝామున, చేతుల గోరింటాకు కడుక్కుని, చల్లని చేయి తియ్యని వాసనల్ని మూచూస్తూంటే-పైనుంచి చందమామ, సన్నబియ్యం పరమాన్నం ముద్దలాగా, అరగదీసిన సబ్బుబిళ్ళలాగా, చల్లకుండలో వెన్న పూస ముద్దలాగా వుండి—సన్నగా, చిన్నగా నవ్వుతాడు.

మనం తప్పనిసరిగా ఆ చందమామను చూస్తాం.

మనమూ నవ్వుతాం.

"మామయ్యోవ్, నవ్వితే నవ్వావులే. మేం యిప్పుడు చద్ది ఆరగించి ఉయ్యాల బూగుతాం!" అని చెప్తాం! చెప్తామా? అనుకుంటాం! అనుకుంటామా? ఏమో! ఉయ్యాల సరదాలో అనుకోమేమో.

వేపచెట్టుకో చింతచెట్టుకో ఉయ్యాలా.

చిన్న చిన్న ఊపులు చాలవు! ఎంత పెద్ద ఊపు అయితే అంత సరదా. అంత సంతోషం.

ఇప్పుడు నా మనస్సు ఉయ్యాల ఊపుల్ని భరించలేదు. ఎక్కడ పడిపోతామో అని భయం! ఎవరు ఉయ్యాలా ఊగినా భయమే. పసితనంలో వుండే బలము, వయస్సులో ఉండే బింకం, తగ్గాకే జుట్టు నెరుస్తుందల్లే వుంది.

నలగగొట్టి, చితకకొట్టి, వెన్నుపాం చావగొట్టి 'రేపు' అనే మధురమైన వరాన్ని మృత్యుముఖం అంత భయంకరంగా స్ఫురింపచేసి జీవిత బలాన్ని తినేస్తుంది.

"కాల్చే ఆకలి
కూల్చే వేదన!
దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ!"

ఎన్ని ఎన్ని కోట్లమంది, మనోబుద్ధి చిత్తాహంకారాలను, మట్టిపాలు చేసినాయో మరి, ఎందరెందరు, నిర్జీవ ప్రతిమలై, బల్ల, కుర్చీ సోఫాల వతు ఐపోయారో.

'ఇది మా బల్లండీ—' దెబ్బయి రూపాయలయింది. అంటూ, యజమానీ, యజమాని తాలూకూ గొప్ప చెప్పుకుంటూంటే,

ఆ బల్లకొయ్య,

తాను సజీవంగా, పచ్చపచ్చగా వున్నప్పుడు, తనమీద పిట్టలువాలడం, పాటలు పాడడం, సూర్యకిరణాలు సోకడం, చంద్రకిరణాల చల్లదనానికి తాను పులకించడం, తననీడను ఆశ్రయించుకొని, కొందరు అన్నం వండు కుని తినీ, కొందరు నిద్రించీ, ఇంకొందరు అదే తమ నివాసం చేసుకొనీ తృప్తిపడడం గుర్తుకువచ్చి—చివరికి నానా హింసలకూ గురి అయి, జీవసారం పోయి, తాను చచ్చిపోయి, ఈ యజమాని దౌర్భాగ్యుడికి కుర్చీగా బెంచీగా అయిపోయానని ఏడ్చి ఏడ్చి శపిస్తుందేమో.

మట్టిని కాల్చి ఇటుకలుచేసి, ఇల్లు కట్టుకొన్నవాడు
చెట్టునుకొట్టి ఇల్లు కట్టుకున్నవాడు మనిషి
ఆ మట్టీ ఈ చెట్టూ శపిస్తే—మనుష్యులు ఏమయిపోయేవారో!
జాతికిజాతే ఏనాడో మాడిపోయేది.

నేను వృథాగా కొడితే, మా అమ్మాయి ఉసూరుమందా ?

అట్లాగే అయితే, ఆ ఉసురు తగిలి, నేను నాశనం కానా...

ఇంతకూ చెల్లాయికి ఏంరాయను సమాధానం?

ఏమీలేదు, అంతా సజావుగా వుందని వ్రాస్తే—

ఏమీ విశేషం లేనప్పుడు ఎందుకూ వ్రాయడం పుత్తరం వ్రాయ డంలో విశేషం వుందిగాని, వ్రాయకపోవడంలో లేదు.

అమ్మాయి, పిల్లల, బావగారి యోగక్షేమాలు వివరంగా అడిగితే సరి! తన యోగక్షేమాలను వివరంగా తెలుసుకోటం—మనిషికి - మంచి ఊరట!

# 13

'పదుగురాడుమాట పాటియై ధర చెల్లు'

లోకానుభవ సముద్రుడు అనేశాడు ఈమాటను! ఎన్నెన్ని సందర్భాలలో గొప్ప గొప్ప మాటలను మూర్ఖంగా తేలికచేసి, తోసిపారేసి, గేలిచేసి, కింపామీదా పెడితే పాపం, వేమన్న హృదయం వేసారిందో .... యెన్నెన్ని అసందర్భాలలో, ఎంతెంత కుమిలి కుమిలి వేమన్నహృదయం ఘోషించిందో మరి!

లేక, మానవ ప్రవృత్తిని కాచి వడబోసి, తాను కాంచిన సత్యాన్ని తనవారికి చెప్పుకోవాలన్న బలహీనత మిగిలిపోయి, సలపరిస్తూంటే — తన వివేకాన్ని తన బలహీనత కుంగదీస్తూంటే, తనలో తాను చెప్పుకున్నాడో ఏమో వేమన్న—

'పదుగురాడుమాట పాటియై ధరచెల్లు'

ఎవరికివారే స్వయంరాజాగా వుండేవాళ్ళు, హనుమంతుడిలాగా తోక ఝాడించడం, లేకపోతే తోక ముడవడం చాతనైనవాళ్ళు, మరొకడి అభిప్రాయంతో కలవడానికి 'ససేమిరా'గాళ్ళు, ఏ విషయంలోనైనా, యెంత వాణ్ణయినా హేళన చెయ్యడానికి ఉస్తాదులు, ఉగ్రమూపులు, ఒక విషయంలో- ఒకమాటను అవునని, అంగీకరించి, అన్నారంటే—ఎంత గొప్ప సంగతి!

సందేహంలేదు!

తెలుగువాళ్ళు, పదిమంది నిస్వార్థంగాగాని, స్వార్థంగాకాని, ఒక్క-మాటమీద నిలిచారంటే—అపురూపమే. ఆశ్చర్యపడతగ్గ సంగతే!

ఏ ఇద్దరూ కలవరు! కలిసినా కలిసిరారు! కలిసివచ్చినా ఎవరికివారే యమునాతీరే! ఏదన్నా ప్రాణభయానికి లొంగి, ఓవేళ 'ఔ'నన్నా వెంటనే,

'తూ, నాబొడ్డుమాల్' పెట్టుకుంటారు! అలాంటప్పుడు, పదిమంది, హేమా హేమీలు, ఒకమాటను శిరసా వహిస్తారా? శిరసా వహించినా, లోపల లోపల తమకు యిష్టమైనా, పైకి అంటారా ?

అమ్మో !

అదీ నిజమే !

ఎన్ని సంగతులనైనా లోపల్లోపల అనుకోగలంగాని, పైకి అనడం వీలుకాదు! అందులో Complex వంట జీర్ణించిననాడు కష్టం!

"ఎండ బాగా వేస్తోంది" అంటే,

"నిరుటికంటె తక్కువే!"

అనందే ఆగలేం.

"మల్లెపూలు బాగున్నాయి!" అని ఎవరన్నా అంటే,

"సన్నజాజులు బెస్టు!"

"ఆవకాయ కాయ యింకా రాలేదుట!"

"అప్పే-వచ్చి నెల దాటింది! అయినా ఈ ఏడు మామిడికాయలు కుప్పలు కుప్పలు!"

"ఈ ఏడు తేళ్ళు జాస్తిగా వున్నయ్! అంటే—"

"వచ్చే ఏడు చూస్కోవోయ్. తేళ్ళే తేళ్ళు! గ్రహచారం సమాచారం! నన్నడుగు చెప్తా!"

"పన్నాలాల్ ఘోష్ గొప్పగా వేణువు వూదుతాడు!" అంటే—

"పాటంటే, సైగల్‌ది పాట. మిగతాది అంతా చెత్త!"

ఇలాంటి వృథా తర్కాలతో, తెలివి ఎక్కువ అయి అఘోరిస్తున్నామే మనం—

మనం, పదిమందిమి ఓ మాటమీద నిలబడగలమా? అలాగని అనుకోగలమా?

అదీ కష్టమే.

ఎన్ని సంగతులనైనా సరే, అసలు అనుకోం. వృధా కాలయాపన అని ఆలోచించం సామాన్యంగా! ఆలోచించినా, అది ఏమీ ఓ దారికి రాదు! అంచేతే ఆలోచించం! ఆలోచించి, అట్లా నడిస్తే, మూడో రోజున తల చొప్పి కట్టుంది!

ఆలోచిస్తామే అనుకో, తేలిన సంగతుల్ని లోపల్లోపల అనేసు కోవాలిసిందే. పైకి అనలేం! "చందమామ హాయిగా వున్నాడు!" అంటే పక్కనే మరొకరికి ఈ మాట గుచ్చుకుంటుంది! పాపం, వారు విరహవేదన శాస్త్రీయంగా అనుభవిస్తూండవచ్చు. ఏమైనా, మాట పడడం కష్టం! వారూరుకోరు! పోట్లాటకు వస్తారు!

"కృష్ణనీరు మంచిది!" అన్నాను. మా తమ్ముడు "గోదావరి Best!" అన్నాడు! మరోసారి "గోదావరి Water is Best!" అన్నాను, కావాలని.

"గోదావరి దేముందిరా! కృష్ణ నీరు మంచిది!" అన్నాడు నాతో! ఏమనుకోవాలి!

సకారణంగా మా మా అభిప్రాయాలు మారినట్లు నటించాలి సొచ్చింది! ఎంత ముఖ్యమైన సంగతి అయితే, అంత పదిలంగా పైకి అన కుండా మన వూహలు పైకి వచ్చి గాలి పీల్చి బ్రతక్కుండా, గుండెల జైలులోపెట్టి, అక్కడక్కడ తొక్కి పారెయ్యడం మంచిది! కాని, సాధార ణంగా జనం ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటూనే వుంటారు! ఒకరి అభిప్రాయాన్ని ఒకరికి వ్రాసుకుంటూనే వుంటారు! తప్పదు! మనుష్యులు

ఎంత మదించి కొట్లాడుకున్నా, ఏమైనా, సంఘజీవులు! ఏకాకులలా, హూష్ కాకులలా కారు. తమ తమ గాథ వాంఛల్ని, గూఢ వాంఛల్ని, నిగూఢాభి ప్రాయాలను తమ తమ హృదయ భాండాగారంలో దాస్తూనే వుంటారు! భరించరానంతగా హృదయంమీద నృత్యం చేసేకే, కదిలించి నిద్రాహారాలు పోనీయనివీ అయితే, పైకి అనేస్తారు! అట్లాంటివి కొన్ని చిత్ర ప్రభలతో చిందులాడుతై. పిచ్చాసుపత్రిలో పెద్రివాడి పియానో వాద్యంలాగ!

పదిమందీ అనేమాట, నినదించేమాట, సామాన్యంగా నినాదం అవుతుంది! కనీసం నినాదతుల్యం అవుతుంది!

నలుగురు

పదిమంది

వందలాది జనం

వేలాది ప్రజలు

లక్షోప లక్షలు

కోటాన కోట్లు—

ఒకే విషయాన్ని గురించి ఒకే పద్ధతితో చింతిస్తారనడం—ఏమో! నమ్మబుల్‌గా తోచదు!

ఏ ఒక్కరో, యిద్దరో ఆలోచించి, మథనపడి, నిగ్గు తేల్చి, పైకి చెప్తారు.

పకడ్బందీగా వ్రాస్తారు!

అది బ్రతకలేని బిడ్డ ప్రాయమై, అరటాకులలో పెరిగిన పాప చందమై, నెల తక్కువ బిడ్డలాగా అయి, ప్రాణం పోక నిలిచి, ఉసురు బలిమి కలిగి, నలుగురి నోళ్ళల్లోనూ పడి, నలుగురి నోళ్ళలోనూ నాని, మళ్ళీ మరుగై,

ఏ బుద్ధిశాలో ఉద్ధరిస్తే పైకి తేలి, ఇక విజృంభిస్తుంది!

"ప్రతిక్షణ విజృంభణాత్ ఉభయబాహూ కూలంకష స్తన త్రుటిత కంచుకం నమత యౌవనం యోషితాం" అన్నట్లుగా బజారులోకి వచ్చి బయట పడుతుంది!

"కాళిదాసు గొప్ప కవి!"

"గ్రేటాగార్బో గొప్పనటి."

"రవీంద్రుడి గొప్పతనం అనల్పమైంది!"

"గాంధీగారు ఏమన్నారంటే—" ఇలాగ!

ఇలాంటి వాటిని ఎవరైనా ఎప్పుడైనా, ఎన్నివేల పర్యాయాలయినా అనవచ్చు! నినదించవచ్చు! ఘూనభోంతరాళాలు దద్దరిల్లేట్లు గర్జించవచ్చు! గర్జిస్తారు కూడా.

ఇంతమంది అనేమాట ఎంత గొప్పది అయివుంటుంది! నిజం, అప్సలూట్ నిజం కాకపోతే—

ఇంతమంది ఎందుకు అంటారు!

చెప్పలేం, సత్యంకోసం కాకపోయినా ఫాషన్ కోసమైనా అనవచ్చు. ఆలివర్ గోల్డ్ స్మిత్ రచన గొప్పది—షెల్లీ పగ్నొకవి!

మేఘ సందేశంలో చూచావూ—"కామార్తాహి ప్రకృతి కృపణాః" ఇలాగ అంటూంటే, ఎదటి వారికి పూజ్య భావం కలుగుతుందనుకోవచ్చు గద. ఏ అమాయకుడైనా నమ్మవచ్చుగద, ఆ కోట్ చేసినవారు, ఎంత గొప్పవారో అని! ఈ మాటను గూడా. మరీ వెర్రి అమాయకుడు అనచ్చు గదా, నలుగురితోపాటు నారాయణా!

"నలుగురితోపాటు నారాయణా!" అనుకోవచ్చునేమోగాని, అట్లాగ వుండడం ఎంత కష్టం!

ఎదురుగుండా తాటాకు పాకలు, చిన్న చిన్న పాకలు! ఓ పూట భోంచేస్తే, మళ్ళీ భోజనం ఎప్పటికొళ్ళు! వాళ్ళతోచేరి, "నలుగురితోపాటు నారాయణా!" అని ఏ గుమాస్తా అయినా అనుకోగలడా?

గుమాస్తా జీతం స్వల్పం! చాటుగా, మాటుగా నాలుగురాళ్ళు ఏరుకుంటే తప్ప. సరీసుగా నెల వెళ్ళదు! వాళ్ళల్లో చేరి ఏ యజమాని అయినా అనుకుంటాడా, నలుగురితోపాటు నారాయణా! అని!

ఇలాగే,

ఆ గుమాస్తా, తనకంటె ఎక్కువ తెచ్చేవారిని అనుకరించి, తన శక్తి చాలక, మిణుకుతూంటాడు!

ఆ యజమాని, తనకంటె హోషుగా ఫెళఫెళలాడే వారి పద్ధతులు అవలంబించి కిందా మీదా పడుతూంటారు! వారూ వీరూ గూడా నిట్టూరుస్తారు!

"ఉపర్యుపరి పశ్యంతః సంతఏవ దరిద్రతి!"

ఎవరూ, నలుగురితోబాటు నారాయణాగారు కారు.

సమస్తానికీ అధికారి, భోక్త, ప్రమాణం అయిన మనిషి, తను, తన తెలివితేటలు, తన శక్తిరక్తులు, తన ప్రత్యేకత అన్నీ మరచి, గుంపుతో కలుస్తాడా?

కలుస్తాడు, ఎప్పుడు? తన్ను తా మరచినప్పుడు!

తన్నుతా మరవడం—కల్ల.

పైకి నలుగురితోపాటు నారాయణా అంటూనే, ఆచరణలో "నన్ను ముట్టుకోకుగాళ్ళు!"

"నన్ను ముట్టుకోకుగాళ్ళు" వెంగలులని చూస్తూ చూస్తూనూ కొట్టి పారెయ్యలేం! వీరిలోనూ కొందరు జ్ఞానులు ఉండవచ్చుగదా.

మహాజనం వికసించిన విద్యుత్తేజంలాగా లేచి, మహోద్రేకాలతో శివం ఎత్తి చిందులు తొక్కుతూంటే....

ఈ జన సంమోహ సందేశాన్ని కవి గానం చేస్తూంటే—

అంతర్ముఖుడు అయినవాడు,

ఏ గుహలోనో, ఏ గుడిలోనో కూర్చుని "ముందు నన్ను బాగు చేసుకోనీ, ముందు నాకు శక్తి రానీ, ఇతరులను తరింప చెయ్యడానికి !" అనుకుని అంతర్ముఖుడుఅయినవాడు—ఈ కోలాహలాన్ని చూచి ఏమను కుంటాడు? పెదిమ విరుస్తాడా? లేక అంతమందిలోనూ తాండవించే చైతన్యానికి ప్రణమిల్లుతాడా? ఇంతకూ ఆయన ఏమంటాడు?

ఏమీ అనడు. అన్నాడో వికటించి, విషమిస్తుంది.

నిజం చెప్పగూడనిది! విషంకంటె ప్రమాదకరం అయింది.

అంత చెలరేగిన జన సమ్మర్దపు కోలాహలంలో, అంతమంది ఏ మాటను అరుస్తున్నారో, ఆ మాటను తిరగేసి, బోర్లేసి, సారం తీయ బోయి, "ఇది పిప్పిరా బాబులూ!" అని చెప్తే ఎవరన్నా—వారు ఆ క్షణం లోనే పిప్పి పిప్పి అవుతారు! బైబులులోని ప్రవక్తలు—ఎంతమంది — రాళ్ళతో దెబ్బలు తిని పోలేదు!

"ఊర్ధ్వ బాహు ర్విరామ్యేష నహికశ్చిత్ శృణోతి మాం!"

"చేతులెత్తి అరుస్తున్నాను! నన్నెవరూ వినడంలేదు!" అని వ్యాసుడి లాగ ఏడవాలిసొస్తుంది!

వ్యాసుడు అదృష్టవంతుడు! అమిత బుద్ధి, క్రాక్, పర్వర్ట్, అనిపించుకోలేదు! అతని రచన భగవద్గీత అయి కూచుంది!

ఆయన రచనలు భారత భూమిని అఖండ భారతం చేసినయ్!

ఏమైనా,

ప్రజాభిప్రాయానికి ఎదురయిన చేదు అయిన సత్యాన్ని వివేకులు ఎవరూ చూస్తూ చూస్తూ చెప్పరు! చెపితేనో, ముందు జరిగే సన్మానం భరించడం కష్టం!

అందుకే ఎవరూ ఎదిరించరు! కార్యసాధకులు అయినవారు కమ్మగా కబుర్లు చెబుతూ, తమ పనిని సాధించుకుంటారు!

కాక, తమ అభిప్రాయాలమీద అచంచలం అయిన విశ్వాసంవున్న వాళ్ళు, గుంపుకు పైదొలగి, దూర దూరంగా పోయి, చెట్టూ పుట్టా ఆశ్రయిస్తారు కాదూ మరి!

పదిమంది ముందు, ఒక్కడి మనసధార ఏం అవుతుందే పాపం!

ఏం,

ఏదయినా అవుతుంది! ఎంత పనైనా చేస్తుంది. ఉన్న ఉద్రేకాన్ని దిగదుడిచి పారేసేంత కొత్త ఉద్రేకాన్ని కలిగించేస్తై తే సరి.

మరో పదిమంది, ఈ కొత్త మాటనే పలికి దీన్ని నినాదం చేస్తారు!

ఇంతకూ గంటా గొంతెచేసి, వెర్రి నమ్మకం పెట్టుకుని అరిచి, తిండీ తిప్పలూ మాని, టమ టమా, తాషామర్ఫా, డప్పుల చప్పుళ్ల చేసేవారు ఉండనే ఉంటారు!

ఇంతకూ వీరంతా ఎవరు? సాధనాలు! సాధకులు కారు! సాధకులు కారు గనకనే అంత ఉద్రేకం!

సాధకులు ఎప్పుడూ—ఏకాకులే, వారిది ఏకాంత వాసమే!

"పదుగురాడు మాట పాటియై ధర చెల్లడం" గమనించి, ఆ పది మందినీ తమ కింకరులుగా చేసుకుంటారు!

తమ మాటకే తాము ఎదురు తిరిగేదాకా వీరికేబాధా వుండదు. కాని వీరందరూ సాధారణంగా "ఆకు మఱుంగు పువ్వులు!"

ఏమైనా పదిమందీ అనే మాటా, వజ్రాయుధంకంటె పదునైనది! దానికి అదే సాటి!"

# 14

"వాసనలేని పూలు, బుధ వర్గములేని పురంబు" అంటున్నారెవరో పార్కులో !

ఆ సందె చీకటిలో, పచ్చని గరికపట్టు కూడా చీకటిముఖంవేసిన సమయంలో పై పద్యం కోట్ చేసిన వారిముఖం స్పష్టంగా కనబడలేదు. గొంతుక-ఎరిగి ఉన్న గొంతుకకాదు. కాని ఆ అన్న ఒడుపుమాత్రం మహా. అందంగావుంది. మాంచి గడుసుగా అంటున్నారు.

పూలువాసన వెయ్యకపోతే—ఏం

పూర్ణో పండితులు అంటూ లేకపోతేనేం!

ఏంనష్టం!

పూలువాసన వేస్తే, కొందరు దౌర్భాగ్యులకయినా, మనస్సుకు చక్కిలిగిలి పెట్టినట్లవుతుంది. హృదయానికి, కోరికలకూ పొత్తుకుదురుతుంది. బుద్ధికీ మనస్సుకూ పోరు కలుగుతుంది. నిజమే! కాని, పూల పరిమళం— గ్రహించేవారు తక్కువ,

అయాచితంగా, కొసరి కొసరి వేసారకుండా, అమాయకంగా తల లెత్తుతాయి పూలు. చేతనైనంతగా పరిమళాన్ని ప్రసాదిస్తాయి! పూలు.

ఎంతగొప్ప సృష్టి! పూతేలేకపోతే పూలు అంటూఉన్నా, వాసన లేకుండా ఉంటే- ఎంతహాయి! ఏ చక్కిలిగింతా మనస్సుకుండదేమో, హాయిగా నిద్ర పట్టింది. వూళ్ళో పండితుడు అంటూ వుండకపోతే, దేనికీ ఆలోచించుకో నక్కరలేదు.. పండితులుచేసే గత్తరను భరించే బాధంటూ వుండదు. పూలు, పండితులు తమకున్న శక్తియుక్తుల్ని ఎవరెవరికో అయాచితంగానైనా సరే పంచిపెట్టందే ఆగరు.

నిద్రాహారాలు మాని, తలిదండ్రులకు దూరమై, ఎన్నెన్ని కష్టాలో పడి—ఎంతెంత జీవనశక్తినో కర్చుపెట్టుకొని, ఎన్నెన్ని అవమానాలనో మూటకట్టుకుంటేనే గాని విద్యరాదు. ఆ వచ్చిన విద్య—వృథాగా ఎక్కడ పోతుందో అని—విద్వాంసుల క్షోభ. అందుకని, అడిగినవారికీ అడగని వారికీ చెప్తారు. చాదస్తం ముదిరిందా! జబ్బ పట్టుకొని, నిలేసి అయినా చెప్పి తీరుతారు. పూలుగూడా అంతే. భూసారం, చెత్తాచెదారంతోపాటు పీల్చి-పంకాన్ని తీసుకుని, పరిమళంగా మార్చుకొనే దైవమిచ్చిన శక్తిని, వృథాగా నైనాసరే వెదజల్లుతాయి. ఎదుటివారికి ఏఏ వికారాలు కలుగుతాయోనని ఆ పండితులూ గమనించరు! ఈ పూలూ పట్టించుకోవు.

వాసనలేని పూలు అంటూవుంటాయా? ఎందుకు ఉండగూడదు?

వుండడం కష్టం.

'గంధవతీ పృథివీ' పృథివికి లక్షణం గంధం కలిగివుండడం.

ఏదో ఓ వాసన అంటూవుండడం భూమిపై వస్తువులకు సహజం.

మరిపూలు!

మొగ్గతొడిగింది మొదలు, పరిమళాల పంటభూములాయె పూలు!

ఐనా. కొన్నిపూలు, పరిమళంలేని వరంకోరుకొని వుంటాయి కాబోలు. అలాంటి వాటికి, కంటికి ఇంపైన రంగులు వుండవామరి.

పీనాసికి శాంతం అనేగుణం వెన్నంటి వున్నట్లు!

ఏ గుణం లేనివారికి ఐశ్వర్యమో అధికారమో వున్నట్లు.

మనలో మాట—

ఐశ్వర్యమూలేక, అధికారమూలేక, చదువులూ సంధ్యలూ లేక, అందమూ చందమూలేక—ఎందరెందరు అభాగ్యులు లేరు ఈప్రపంచంలో! వుండివుంటారు పైకి కనబడకపోయినా. కొట్టవచ్చినట్టు గుబాళించకపోయినా ఎంత నికృష్టుడికిగూడా, ఏదో ఓ సుగుణం అంటూ వుండివుంటుంది! ఏ సుగుణమూ ఏదుర్గుణమూ లేనివారు అంటూ వుండరు. 'దృష్టం కిమపిలోకే స్మిన్, అని ర్దోషమనిర్గుణం' అని దేవుడిమాట!

సుగుణమూ, సువాసనా వుండక తప్పదు.

ఈ సృష్టివిచిత్ర మేమిటోగాని, దుష్టం అయినదయినా అది వుండక పోతేంవెల్తి తప్పదు! శకుని లేకుంటే భారతంలో అందమేలేదు. శూర్పణఖ అంటూ లేకపోతే—రామాయణంలో రక్తిలేదు, కాని—తప్పదు. వాసన లేని పూలూ వుంటాయి. విబుధవర్గంలేని పురాలూ వుంటాయి! 'విబుధవర్గం అంటే దేవుళ్ళు అనా అర్థం? విబుధవర్గం అన్నమాట అర్థాన్ని 'బుధ వర్గం' అని పద్యంకోసం కొట్టేశాడా కవి! విచారించవలసిందే. 'దైవవర్గం' అంటే, దైవంమీద మనకున్న భావనల రూపం. దైవములేని తావు లేదు! ఈశావాస్యమిదం సర్వం! దైవభావనలు లేనివారు ఉండవచ్చు! ఉంటే, ఏం హాయి వుంటుందీ?

దైవభావం అంటూ వుంటేనే — పాలు, పూలు, పూజ, సంబరం, తృప్తి కలుగుతాయి జీవితంలో!

నలుగురు చేరడం, ఆ చేరినవారు సంతోషంతో సంబరంగా - వుండడము, ఏదో తృప్తిగా చేసేపని, ఆ సమష్టి — పనిలో సంతోషం, ఇవన్నీ

మనిషి వొదులుకుంటాడా ? వొదులుకుంటే జీవితము జడప్రాయం అయి పోదా?

నేనే తప్పుగా వూహిస్తున్నానేమో! విబుధవర్గంకాక, బుధవర్గమేనేమో పండితుడు చాదస్తంవల్ల కంపుకొట్టినా, అతని విద్యా పరిమళాలు ఎంత అవసరం!

'శాస్త్ర దృష్టి' అతనికి అధికం! విశ్వవిఖ్యాతులు జీవితాన్ని మథించి, తేల్చి చెప్పిన వారి అనుభవాలు అతనికి కొట్టినపిండి! తెలుసుకుందాం అని అతని దగ్గరికిపోతే—అతను పంచిపెట్టేవి, కాంతి ప్రవాహముగాని, కట్టె కంపా కాదు మరి!

వాసన వున్నపూలూ అవసరమే, బుధవర్గమూ అవసరమే !

కాని, కొన్ని పూలకు వాసన వుండదు. కన్నులకు ఇంపుగానూ వుండవు.

మరి....

వాటికి ఓషధిఐన యోగ్యత అయినా వుంటుంది!

ఉమ్మెత్తపూలు, రోడ్డువారను రాలిపడే తంగేడు పూలు, ఏమంత వాసన వేస్తయ్? ఏమంత కన్ను చెదరగొడతై? కాని, రెండూ రెండు మందులు మరి !

వాసన లేకుంటే నేం.... !

వాసనే ముఖ్యమా?

ఆహా. ముందు ఆకర్షించేది వాసనే-తరువాతనే వుపయోగం.

వాసన....!

వాసన అంటే ఏమిటి ?

ముత్తుస్వామి దీక్షితులు—సరస్వతీదేవిని స్తుతిస్తూ —

'వాసనాత్రయ వివర్జిత వరముని భావితమూర్తే!' అన్నారు.

వాసనాత్రయం అంటే- ?

పువ్వులకున్న వాసన, ప్రెంకులకున్న వాసన, కొత్త పుస్తకాలకున్న వాసన, మంచిగంధం వాసన లాంటి వాసనేనా ఇక్కడా అని. ఎందరెందరినో అడిగాను! వారి వారి చిత్తం వొచ్చినట్లు చెప్తారు! తెలిసి చెప్పకపోనీ- తెలియక చెప్పనీ - నిజం రాలేదు.

సీతారామాంజనేయంలో కంటబడింది! వాసనలు మూడు-లోక వాసన, దేహవాసన, శాస్త్రవాసనలు అవి !

లోకం తెలియడం, లోకంలో అందరూ తనను మెచ్చుకొని, సన్మానాలుచేసి, డప్పా వాయించి, శిలాప్రతిమలు ప్రతిష్ఠించి-ఉక్కిరి బిక్కిరి చేస్తే సంతోషించే వాసన ఒకటి-

తాను, తన అందం, తన సొగసు, తన శరీరం కాంతి, వన్నె, వర్చస్సు, అది మారుతూంటం. మనకు ఇష్టంలేని కొన్ని మార్పులు రాకుండా ఉండాలనీ, ఇష్టమైన మార్పులే రావాలి అనీ, ఈ శరీరంతో అత్యధిక కాలం భోగాలను అనుభవించాలనీ కోరుకునేది మరో వాసన.

అన్ని శాస్త్రాలూ చదవాలనీ, సమస్త శాస్త్రాలూ చదివి, అలా చదివిన ఇతరులతో డిక్కీకొట్టి, ఓడి, గెలిచి, వారు చిన్న ముఖం చేసుకుని, తలవొంచుకుని, మనకు పాదాక్రాంతులై — జయ జయధ్వానాలు చేస్తూవుంటే-సంతోషపడే వాసన ఒకటి ! కాదా, శాస్త్రాలలో ఇలా వుందని మూర్ఖపు పట్టు పట్టుక్కూచోడం గూడా ఆ వాసనేనేమో.

ఇవీ వాసనలు.

ఇట్టి వాసనలు లేక, అంటే, ఏ కోరికలూ లేక, మనస్సును కూడా కట్టిన మునులు భావించిన మూర్తి నీది తల్లీ అని ముత్తుస్వామి దీక్షితులవారు సరస్వతీదేవిని స్తవం చేశారు!

ఎంత గొప్ప సంగతిని గానంచేశారు దీక్షితులవారు !

మహానుభావులు !

పూలవాసనలు వేరన్నమాట.

సాయింత్రం. సంధ్యారాగం యింకా రాలేదు ! చందమామ తెల్ల మొహం వేసుకొని, నేను ఉన్నానర్రోయ్ అనడంలేదు. బాటలమీద నీళ్ళు చల్లలేదు! వాతావరణంలో ఉడుకు తగ్గలేదు, కూజాలలోని నీళ్ళు కూడా ఇంకా వెచ్చ వెచ్చగానే వుంటున్నాయి— !

ఇన్ని మల్లెపూలో, సన్నజాజి పూలో నీళ్ళలో వేశాం—

కాస్సేపటికి నీళ్ళు చల్లబడ్డాయి.

ఇంకాస్సేపటికి నీళ్ళకూ సువాసనలు అబ్బుతున్నాయి!

పూలు పకపకా నవ్వినై.

వాటిని చూచి మన మనస్సులూ మధురించినాయి !

పూలే లేకపోతే, ఏ కాలంలోగాని అందం ఏమి వుంటుంది?

పరిమళమే లేకపోతే, పువ్వుల సుఖం ఏమి వుంటుంది?

ఎంత అందం.

ఆహా! అంత స్వార్థమూ వుంది మనకు.

చెట్లను పూలకోసం పెంచే యిది, చెట్టునున్న పూలనుగిల్లే తొందర, గిల్లుకొచ్చిన పూలను — దోహదాలతో వికసింపచేసే యావ, వికసించిన

పూలను, చెండ్లుగా గుచ్చి బంధించే తహ తహ, తల్లో పూలు పెట్టుకొని సంతోషపడక !

అట్లా పూలుపెట్టుకొన్న వారితో, మేమూ పూలు పెట్టుకున్నాం అని గొప్పకుపోవడం, పూలు తలలో పెట్టుకోని వారితో, 'మేం పూలు పెట్టుకున్నాం' అని గొప్పకుపోవడం—

ఇదంతా ఏమిటి ?

స్వార్థం కాదూ ?

అమాయికంగా కొమ్మలను తలఎత్తి చూచే పూలను చూచి తృప్తి పడిపోక, తుంచిపారేసే గుణం, తుంచిన పూలను మూచూడక యింకొకరికి ఇవ్వక, చొక్కా జేబులో వేసుకొని, ఆ విషయం మరచి, మన్నాడు ఆ చొక్కాను అట్లాగే యిస్త్రీకి పారేసే గుణం మనలో ఇంకా వుండనే వుంది గదా! అందుకే కవీశ్వరుడు—కృష్ణశాస్త్రి

దారి తలలెత్తు నింత సౌందర్య లవము
వదిలిపోలేరు, చంపెడువరకు — వీరు,

అని పడినక్షోభ న్యాయమైనదేగదా మరీ.

మాటలయితే ఎన్నయినా అనుకోవచ్చుగానీ, మనిషి పువ్వులను విడిచి వుండలేడు మరి! ఎంత దరిద్రులయినా, మల్లెపూలను మంగలాన వేయించలేరు మరి! గులాబీపూవు రెక్కలను తుంపి తినకుండానూ ఆగలేరు! పూవును విడిచి మనిషి వుండలేడు. 'స్వార్థం అనుకో. మరేమైనా అనుకో. అందుకేనేమో, శ్రీ రవీంద్రనాథటాగూర్ — కలవపూవును, పూర్వజన్మ నుంచీ తెచ్చుకున్నాను' అని మహోన్నతంగా అన్నాడు.

పూలను చూచి మనిషి మారతాడు! తనకు తెలియకుండానే వికసిస్తాడు, పూలతో వర్తకంచేస్తే తప్ప !

పూలను చూచి వికసించనివారూ, సంగీతానికి మైమరవనివారూ అసాధారణులట. మనుష్య ధర్మాలకు అతీతులట. వారికేంగాని, సాధారణులం మనం, పూలను విడిచివుండం.

అలాంటి పాపిష్ఠి కాలమే సమీపిస్తే— కాయితంతోనైనా పూలు చేసుకొని ఆనందిస్తాం! నల్లరాతిలోనైనా, మల్లెపూవును చెక్కుకొని ఆకారాన్ని చూచి అయినా తృప్తిపడతాం. మనిషికీ పూలకూ అంత గట్టి సంబంధం!

నిజమేగానీ—ఇంత వాంఛనీయమైన పూలు, ఎక్కువకాలం ఉండవు! అల్పాయువులు మరి పుష్పాలు. పదిరోజులు వుండే సన్నజాజి, మరింత ఎక్కువకాలం వుండే మల్లెలు — ఇట్లా మన కోరికలతోపాటు పూలను ఎందుకు సృష్టించదో దైవం. అవి, ఎప్పుడూ అందుబాటులోనే పడివుంటే. వాటి విలువ తగ్గుతుందని కాబోలు.

ఆమాటా నిజమేగాని—

ఇన్ని అనుకుని, ఇన్నింటికి చేయివేసి, ఇన్నివిధాల గెలిచి ఓడి విర్రవీగే మనిషికి ఉందా, దీర్ఘాయువు! లేదు. కొద్దో గొప్పో తేడా తప్ప! అన్నీ అల్పాయుస్సు గలవే!—

జ్ఞానులు ఒకరు చెప్పారు—

మనిషి యోగంలో ప్రవేశించి, యోగశక్తిని సాధించినప్పుడు — ఎక్కువకాలం జీవించవచ్చు.

అతనికి సాధన పూర్తికాకపోతే, మళ్ళీ పుట్టడం, పెరగడం అంతా-కాలహరణ! అనవసరం. ఈ శరీరంతోటే, ఆ సాధన పూర్తిచేసుకుందాం అనుకుంటే, ఆ యోగి వందలకొలది సంవత్సరాలు వుంటాడు! కాని — కోరికలు అతనికి ఉండవు! ఈశ్వరదర్శనం కోరే కోరికే అతనిది!

అలాకాక, అదీ యిదీ కావాలని కోరినప్పుడు - మామూలు మనిషే అతనూ. అవతారమూర్తులు, ఋషులు, యోగులు, జ్ఞానులూ ఎక్కువకాలం

భూమిమీద ఉండాలని కోరుకోరు. వచ్చినపని చూసుకొని త్వరత్వరగా వెళ్ళిపోతారు అని.

ఐతే పూలు ఎంత జ్ఞానులో! ఋషులో? దేవతలో మరి! అంతా మౌనసంగీతమే పాడి, ఉదాహరణప్రాయంగా జీవించి, త్వరలోనే ఈశ్వర సన్నిధికి చేరుకుంటున్నయ్ పూలు....ఎంత అదృష్టం పూలది!!

# 15

అర్ధరాత్రం! కార్తికపూర్ణిమ! ప్రపంచం అంతా పాల సముద్రంలో తేలి ఆడుతూన్నట్లుంది! చలిచలిగానూ వుంది! బట్టబయలులాగ, గుంభనలేని సంసారంలాగా, అంతా తెలిసిపోతూన్నట్లుంది పరిసరప్రాంతం! వెన్నెట్లో, అరుణాచలంకొండ మనోజ్ఞంగా వుంది! అహోరాత్రాభిమాన దేవతలు శ్రీ చక్ర స్వరూపం అయిన ఆ కొండచుట్టూ ప్రదక్షిణం చేస్తూంటారు కాబోలు! ఎవరెవరో విదేశీయులు కొండను చుట్టడానికిపోతూ నన్నూ రమ్మన్నారు! బద్ధక సార్వభౌముణ్ణి మరి నేను! వారి మాటలు వింటానా....! శ్రీచక్రం అయిన ఆ కొండను, మనసా వాచా ప్రదక్షిణం చేశాను! బెంగం రోడ్డునుంచి మలుపులు తిరిగి కొంతదూరంపోతే—ఎన్నో విశేషాలు!

కొండ కెదురుగా నిలబడి గట్టిగా అరుస్తే, ప్రతిధ్వని వస్తుంది! మనస్సులోనే అరిచి ప్రతిధ్వని మనస్సులోనే విన్నాను!

ఇరుకురాళ్ళ దగ్గిర తాపీ ధర్మారావుగారు గుర్తుకొస్తారు! వారినీ, వారి రచనలనూ గుర్తుకు తెచ్చుకున్నాను!

పళుమలై స్వాములవారు ఎక్కువగా మకాంచేసే సత్రంలో దాహం కాకపోయినా, మనస్సులోనే దాహం తాగాను. పెద్ద గుడిముందు నిలబడి,

రథచక్రాన్ని చేతితో తాకి, అరుణాచలేశ్వరులకూ అపీతకుచాంబకూ నమస్కరించాను! శ్రీ రమణాశ్రమం దగ్గిర నిలబడి భగవాన్‌సమాధికి జాగిలబడ్డాను.

ఇదంతా - రెండు నిమిషాలు!

ఆ అరుణాచలం కొండకు ఎన్ని సొగసులో. ఓ రోజు ఉదయం - వెంకటచలంగారు చూడమన్నారు అటుకేసి, చూస్తే -

సూర్యకిరణాలకు ఆ ఎర్రనికొండ మెరిసి విచ్చిన మందారపుష్పం లాగుంది! ఆ కాస్తలోనే మబ్బుకమ్మి కొంతభాగం నల్లకలువలాగుంది!

కావ్యకంఠుల శ్లోకాలూ, కాళిదాసు వర్ణనలూ గుర్తుకువచ్చి నాలో నేను బిగ్గరగా చదువుకున్నాను....

ఇంతలో మైకం వచ్చింది కాబోలు -

మబ్బులు నిర్మలాలు అయినయ్, మళ్ళీ యింతలో మూసుకున్నయ్! కాస్తసేపు చంద్రుణ్ణి దోబూచాడి తప్పుకున్నయ్!

ఛాందోగ్యంలోని,

అశ్వఇవ రోమాణి విధూయ పాపం,
చంద్ర ఇవ రాహోర్ముఖాత్ ప్రముచ్య
ధూత్వాశరీర మకృతం కృతాత్మా -
బ్రహ్మలోక మభిసంభవామీత్యభి సంభవా మీతి—

అన్న కోరికలాగ వుంది ఆకాశ సామ్రాజ్యం!

నక్షత్రాలు ప్రయాణిస్తున్నాయి! చిత్రంగా వుంది! బాటసారులలాగ, తిరుణాళ్ళలో ప్రజలలాగ పోతున్నాయి నక్షత్రాలు!

కొన్ని ఒకచోట గుంపులుగా చేరినయ్!

అద్భుతం....!

ఈలాంటి కలలు ఈ మధ్య వస్తున్నయ్!

అలవాటు గూడా అవుతూన్నయ్!

నక్షత్రాలు తమాషాగా ఓ ఆకారం తాల్చినయ్! ఏదో అక్షరం! ఏ లిపో తెలియదు, గాని అది ప్రణవం, ఓంకారం అని మనస్సుకు తెలుస్తోంది!

ఎవరో స్త్రీలు!

ముగ్గురు, ముగ్గురు! వారి వారి దుస్తులు, ఆభరణాలు, సలక్షణత చూస్తే, నా చేతులు, హృదయం, తల వారికి నమస్కరించినయ్! వారు నాకు నమ్యలు!

ఆ ఉన్నత తుంగనాస, నీలపటాభిరామ, ఊర్వశి అనిపించింది! అతితెల్లని ఆమె వంటిరంగు—శరీరంలోని రక్తప్రసారాన్ని గూడా తెలియనిస్తోంది! పాలూ, కుంకుమపువ్వూ తేనె కలిసి ఈమెగా అయిందా అనిపించింది!

"నా నమస్కారం స్వీకరించండి—తాము వూర్వశి!"

నాజంకు కొంకులు ఎక్కడికి పోయినాయో! అనేశాను.

ఊర్వశి మందహాసం చేసింది. ఆ నవ్వు ఒక్కటే చాలు, ఎంత వయస్సు వచ్చినా, ఎంతకాలం గడిచినా సౌందర్యానికి ముదిమి, చావు లేవు అని చాటడానికి!

గొప్ప గొప్ప శిల్పులు, కవులు సౌందర్యవతులను ఎందుకు భావిస్తారో అప్పుడు తెలిసివచ్చింది! అందం అంటూ వుండాలేగాని, అది ఎన్నడూ మాసిపోదు!

ఊర్వశి నవ్వు నా నరాలమీద సంగీతం వాయించింది! ఆమె కన్నులు, దేవులపల్లి కృష్ణశాస్త్రి చూస్తే ఏమని వర్ణించేవాడో!

ఆమె కన్నులలో అనంతాంబరంపు నీలినీడలు కలవు .... అనేవాడు అప్రయత్నంగానే!

నిజమే, ఆమే ఊర్వశి!

వేదాలలో ప్రస్తుతింపబడిన ఊర్వశి, పురాణాలలో పరిభవం చూపిన ఊర్వశి, రవీంద్ర మహాకవిని ఉక్కిరి బిక్కిరి చేసిన ఊర్వశి ఈవిడా ?

ఆవిడ కాలిగోటికి కూడా నేను తలవొంచుతున్నాను.

ఎవరో పిలిచినట్లు అయి, తలతిప్పి చూచాను!

పరిమ్లానముఖి ఈమె.

ఈవిడే మాళవికట.

ఓ, కాళిదాసు నాటక నాయికలు!

అమ్మా, మీరు శకుంతలా ?

తల్లీ, నీ బిడ్డపేరుతో మేము భారతీయులం అయినాము! నీ బిడ్డడే చక్రవర్తి కాకపోతే, ఫరాత్ నదీతీరం నుంచి — ఇంతదూరం వచ్చి, ఈ దేశాన్ని పాలించకపోతే, ఈ దేశానికి ఆ బేరట్ (ఫరాత్) రాజులదేశం అనే పేరు రాకపోతే-ఆనాడు మమ్మల్ని ఏమనేవారో....!

శకుంతలలో మార్పులేదు!

"మీ మాటలు నా రక్తంలో ఇంకినయ్! మీరు కనీసం పాతిక సంవత్సరాలకు పైగా నాలో కలిసిపోయారు! అదే మరో మాటగా, నా కష్ట కాలంలో—మీ మాటల్ని తలుచుకుని ఊరట పొందాను.

బిచ్చగాడు, పొద్దున్నే వేషం వేసుకొని, పరాయిదేశంలో బిచ్చానికి బయలు దేరినట్లు, తొలిసారి బతుకు తెరువుకోసం మద్రాసు వీధులకు బయలు దేరేప్పుడు—

"కథమి వ తాతస్య అంకాత్ పరిభ్రష్టా
మలయలతోన్మూలి తేవ చందనలతా
దేశాంతరే జీవితం ధారయిష్యే !"

అన్న వాక్యం బలంగా చేసుకొని కదిలాను!

వసనే పరిధూసరే వసానా,
నియమక్షామముఖీ ధృతైకవేణీ
అపినిష్కరుణస్య శుద్ధ శీలా
మరుదీర్ఘం విరహవ్రతం బిభర్తి

అన్న మహాకవి మధురవాక్కు చదివి చదివి కుమిలి ఏడ్చాను !

శకుంతల చలించలేదు!

నిజమే, తప్పు నాదే మరి! పరాయి ఆడదానితో, నీవు విరహంలో వేగిపోతూంటే—నీ విరహం చూచి నేనూ కుమిలి ఏడ్చాను అని అంటే ఆవిడకు ఎలాగుంటుంది!

ఈ మాట అన్నది దుష్యంతుడు. తన భార్య, తనకోసం విరహ వేదన పడుతూంటే—నాయకుడికి సానుభూతితోపాటు కొంత తృప్తి గూడా వుంటుంది. అదే, ఎవడో దారిన పోయేవాడు, బహు కాలానికి తారసిల్లి పాపం, నీ భార్య నీ కోసం విరహవేదన పడుతోంది! నేను అది కవి వాక్కులలో చదివి బహు విచారపడ్డానయ్యా అంటే—

కావ్య గత జీవితం గనుక, దుష్యంతుడూ, ఆయన దేవేరి శకుంతలా, సామాన్యుణ్ణి, బహు పేదవాణ్ణి నేనూ, సమానంగా మాటా మంతీ అనుకోడానికి వీలు అయిందిగాని—జీవితంలోనే అయితేనో—ఏమయ్యేదో మరి !

నన్ను నేను చిన్న అద్దంలో చూచుకున్నాను!

నా తల తిక్కలల్లో నేనుండి, వ్యాస వాల్మీకుల్ని, నన్నయ తిక్కన పోతన్నలనూ చదివి, మరి ఎవరినీ తృప్తిగా ఆనందించ లేకపోయాను. ఎంకిని మినహా, తెనుగు వాంగ్మయంలో మరే నాయికా నాలో కలిసి పోలేదు. పొగరుమోతుతనం కళ్ళకు ఎగదట్టి, కాళిదాసునే కాదన్న క్షణాలు వున్నాయి. తప్పంతా నాదే కదూ! ఉఁహూ, జరిగిందానికి ఏం చేస్తాం! చేసిన తప్పు మళ్ళీ చేయకుండా ఉంటేసరి.

నా జన్మలో నేను ఎన్నడూ పల్లెత్తు మాట అనలేకపోయింది ఒక్క సీతమ్మను గురించి! కుంతీదేవిని గురించి! మిగిలినవాళ్ళ కష్టసుఖాలు, ఆమోద ప్రమోదాలు అంతగా నా ప్రాణాలను గిలకొట్టలేదు! వారిద్దరి తరువాత—శకుంతల!

"సీతమ్మ తల్లిని గౌరవించినంతగా, మిమ్మల్ని గౌరవంగా చూచు కుంటాను!" అన్నాను.

శకుంతల కన్నులు ఎత్తి చూచింది.

శకుంతల గంభీరురాలు.

"నేటికి కాళిదాసు నాయికలు దర్శనం ఇచ్చారు. ధన్యుణ్ణి!"

"మాకు తెలుసు" అంది మాళవిక.

నన్ను గురించి ఏం తెలుసో వారికి మరి! అనేక అవస్థ లున్నాయ్ నాకు.

మంచిని ముంచెత్తే చెడు ఉన్న జాతకులలో ఒకణ్ణి మరి!

"చూడండి!"

ముగ్గురు దయగా నన్ను చూచారు.

"మాళవిక రాజకుమారి. ఇరావతీ సన్నిధానంలో, ఆమె ఎంత వ్యధ అనుభవించారో! తలుచుకున్నప్పుడల్లా—

ఆ ఇరావతి,

అవిశ్వసనీయాః పురుషాః, మయా ఆత్మనో వంచనావచనం ప్రమాణీకృత్య, వ్యాధగీత రక్తయా హరిణ్యేవ ఆశంకితయా నవే జ్ఞాతం ఏతత్” అనీ,

విశ్వసనీయోసి, మయానామ, న విజ్ఞాత మీదృశాం వినోద వస్తుకం ఆర్యపుత్రేణ ఉపలబ్ధమితి, అనీ అంటూంటే—

మాళవికకు ఏమేమి గుర్తుకొచ్చాయో మరి! అదోలాగు చూచింది!

ఆ చూపు ఉదాత్త ప్రకృతులకే చెల్లు!

దీర్ఘాక్షం శరదిందు కాంతి వదనం బాహూనతా వంసయోః
సంక్షిప్తం నిబిడోన్నత స్తన మురః పార్శ్వే ప్రమృష్టే ఇవ!”

కాళిదాస మహాకవికే చెల్లింది మీ రూపాన్ని చిత్రించడానికి! ఎంత సొగసిపోయారో వారు ఆనాడు!

యక్షపత్ని మరి యిద్దరితో ముందుకు వచ్చింది!

ఈవిడ 'మద్గోత్రాంకం విరచిత పదం గేయముద్గాతు కామా' అని ప్రియుడిచేత అనిపించుకున్న ధన్యురాలు! అంతే.

నన్నెందుకో మేఘసందేశం ఎక్కువ మత్తెక్కించలేదు. ఆ మత్తు అనుభవించినవారు శ్రీ రవీంద్రనాథ టాగూర్!

యక్షపత్ని పక్కలను, పరమపూజ్యురాలు, గంగవంటిది, అరుంధతి వంటిది, మా తల్లి పార్వతీదేవి వంటిది పూజ్యురాలు వుంది—

“అమ్మా! సీతమ్మా!”

— మా అమ్మ పేరు సీతమ్మ. అమ్మ అనే భావం రాగానే మా అమ్మే నాకు కగిపించేది. ఆ పేరే నోటికి వచ్చింది!

సీత తలఎత్తి చూచింది !

"అమ్మా, నీవు సీతమ్మవా ?"

భవభూతి ప్రాణాలలో చిందులాడిన తల్లివా ? వాల్మీకికి గొప్ప దనం తెచ్చిపెట్టిన తల్లివా ? వాల్మీకిని మించి మా కాళిదాసు నిన్ను రచించా డమ్మా.

"సాహం తపస్సూర్యనివిష్టదృష్టి
రూర్ధ్వం ప్రసూతేః చరితుం యతిష్యే!
భూయో యథా మే జననాంతరేపి
త్వమేవ భర్తా, న చ విప్రయోగః !"

అన్న సందర్భంలోని ఏడెనిమిది శ్లోకాలూ, కాళిదాసు గొప్పతనానికీ, వాల్మీకిని మించిన గొప్పదనానికి నిదర్శనం, తల్లీ — అంటూనే ఆవిడకు పాదాభివందనం చేశాను !

అయోనిజ అయిన సీతమ్మ, జీవితమంతా ఇబ్బందుల పాలయిన సీతమ్మ, నేనీసారి పుట్టి పెరుగుతూన్న తెలుగుగడ్డమీద కూడా అడుగుపెట్టి ఆచంద్రార్కం నా తెలుగుజాతిని పవిత్రం చేసిన సీతమ్మ – లంకేశ్వరుడు వస్తూంటే చూచి,

'ప్రావేపత వరారోహా, ప్రవాతే కదళీయథా' అయిన సీతమ్మ హను మంతుడి మాటలో – లంకలోని అశోకవనంలో,

ప్రతి పత్వార శిలస్య విద్యేవ తనుతాంగతా' అయిన సీతమ్మ కాము కుడు అయిన శ్రీరామునికి దేవేరి అయికూడా,

'భూ యో యథా మే జననాంతరేపి
త్వమేవ భర్తా— న చ విప్రయోగః' అనగల్గిన ధీమాగల సీతమ్మ, పాదాలకు నమస్కరించాను !

నా ప్రాణాలకు హాయి.

నా పాపాలకు పరిహారం. నా దౌర్భాగ్యం పటాపంచలు! చాలు. జీవితంలో ఒక్క గడియ ఐనా, యింతది వుంటే!

'నాయనా ?'

ఎవరీ చల్లని తల్లి ?

సీతమ్మ చెప్పింది. సుదక్షిణాదేవిట! అబ్బ! మనుష్యేశ్వరధర్మ పత్ని ఈ యిల్లాలు.

సార్వభౌముడికి భార్య అయికూడా, ఆవును కాచిన యిల్లాలు, రఘు మహారాజు అంతవాడికి కన్నతల్లి; గోపూజా తత్పరత్వంలో పండిపోయిన మహారాణి—

అమ్మా !

చిలిపినవ్వులు వినిపించినయ్; గుర్రం మెడలో మువ్వల మోతలాగు! ఊర్వశి నవ్వుతోంది !

అందానికి మారుపేరు ఊర్వశి! ఊర్వశిని గురించి తెలియాలి అంటే, రవీంద్రనాథ టాగూర్ ఊర్వశి చదవాలి! బెంగాలీ భాష నాకు రాదు గనుక, వేలూరి శివరామశాస్త్రిగారు, నాకు రవీంద్రుడి ఊర్వశిని చదివి చెప్పారు చోడవరంలో వారి తోటలో!

ఊర్వశి నవ్వితే, మానవ మాత్రుడు, ఆగలేడు!

నిజమేగాని, ఊర్వశిముందు, మహాకవి కాళిదాసూ చలించాడా ?

"నిజం, ఆ మహాకవి చలించారు !"

అయి వుంటుంది! రచన గూడా అలాగే వుంది!

'తెలుసుకున్నావా?'

కొత్త గొంతుక!

ఆజానుబాహువు, సాలప్రాంశువు, బ్రహ్మవర్చస్వి, కుంకుమాంకిత లలాటుడు, ఎవరో మహాపురుషుడు!

అప్రయత్నంగా హృదయం ప్రణమిల్లింది!

ఆయన కాళిదాసు!

నిజంగానా?

ముప్పై సంవత్సరాల తపస్సు ఫలించింది!

చిన్నతనంలో, చిలిపితనంలో, ఆటపాటల్లో, యవ్వనంలో, పొగరుమోతుతనంలో, మూర్ఖత్వం వేళల్లో, ఆమోద ప్రమోదాలలో, రహస్యమావేశాలలో, మరి ఎవ్వరికీ తెలియగూడని సందర్భాలలో—ఒకటేమిటి - నన్ను వెన్నంటి వుండి నన్ను నా పశుత్వాన్ని సహించి, నన్ను మృగాన్ని మనిషినిగా చేసిన మహాపురుషుడా, మహాకవి కాళిదాసా? మహాకవి, కనకదుర్గగుడి కొండలాగు చలించడు. మహాగంభీరుడు!

కాక, ఆయన దర్శనం నాకు కొత్తగాని, ఆయనకో ....

నాలాంటి భక్తులు ఎంతమందో! లక్షలమీద కోట్లమీద వుండి వుంటారు!

కాళిదాస మహాకవి లలాటాన కుంకుమాగ్ని మెరిసింది!

నాతోపాటు మాళవికా, శకుంతలా, వూర్వశీ ఆయనకు నమస్కరించారు.

'చెప్పవేం!'

'ఏమిటి?'

'నేను చలించానంటున్నావుగా!'

చెప్పేందుకేముంది ? మా విక్రమోర్వశీయం అపూర్వ సృష్టి '
ఋగ్వేదం దశమ మండలంలోని, ఊర్వశీ సూక్తంలో —

హయే జాయే మనసా తిష్ఠఘోరే
వచాం సి మిశ్రా కృణవావహై ను !
ననే మంత్రా అనుదితాస్స ఏతే
మయస్కరనే పరత రేచ నాహన్

అని పురూరవుడు అంటే—

కిమేతా వాచా కృణవాత స్తవా హం
ప్రాక్రమిషముష సామగ్రి యేవ !
పురూరవః పునర స్తం ఏకేహి
దురాపనావాత ఇవాహ మస్మి !

అని అంటుందే మరి.

ఆ నిర్లక్ష్యం, కాళిదాసు రచనలో వుంటుందా మరి!

అలాగే,

"గోషాః శతసా న రంహిః
అవీరేవ్రతౌ విదవిద్యుతంనో
రానమా యశ్చితయం తధునయః॥ అన్న వైదిక పురూరవుడేనా, కాళిదాసు పురూరవశ్చక్రవర్తి! ఎంత తేడా వుంది!!

నా వూహలో, కాళిదాస మహాకవే పురూరవుడైనాడా విక్రమోర్వశీయంలో అనిపిస్తుంది !

"ఇదో భ్రమ కాబోలు" అన్నారు మహాకవి !

"నిజమే! తప్పుదిద్దుకుంటున్నాను! కవిని, యోగిని ఈశ్వర శబ్దంతో కలిపి చెప్తారు! కవీశ్వరుడు, యోగీశ్వరుడు అని! సర్వం తాను అయిగూడా, ఈశ్వరుడు తదతీతుడు ఎట్లా అవుతాడో.

తిక్కన,

త్రిభువన శుకదృఢ పంజర
విభవమవేతు నమే సమస్త విష్టప నిర్మో
క భుజంగపతికి, నిఖిల జగ
ద భిన్నరూపునకు భావనాతీ తునకున్

అన్నట్లుగా, అట్లాగే కవీశ్వరుడుగూడా అవుతాడు! కావ్యగత సర్వమూ వారే! సర్వ పాత్రలూ కవే! పైగా కవి తదతీతుడు గూడాను! మహాకవీ— దయవుంచి— చెప్పండి!

కాళిదాసు నొసలు లేచినయ్!

"మీ నాటకాలలో నాయకుల్ని మూడు విధాలుగా చిత్రించారు! నాయికల్ని మూడు విధాలుగా చిత్రించారు!"

కవిగారి కుంకుమబొట్టు మెరిసింది!

"పూర్తిగా నా వూహను విన్నవించుకుంటున్నాను! అగ్నిమిత్రుడు గంభీరుడే కాని, పురూరవుడికి తమ్ముడు! ఆ పురూరవుడూ తీరా వచ్చి పిచ్చివాడైనాడు! కాని,

తాను, తన తప్పువల్ల తల్లడిల్లి వున్నా, ఎంతగా విరహ వ్యధలో గిజగిజలాడుతూన్నా,

యేన యేన వియుజ్యంతే
ప్రజాః స్నిగ్ధేన బంధునా!
సన పాపాదృతే తాసాం
దుష్యంత ఇతి ఘుష్యతాం!"

అన్న దుష్యంతుని ముందు, మిగిలినవారు తగ్గిపోతారు. అలాగే, రఘువంశంలో—అర్ధరాత్రి, తనగదిలోవున్న స్త్రీతో—

కా త్వం శుభే, కస్య పరిగ్రహో వా
కింవా మదభ్యాగమకారణం తే!
ఆచక్ష్వ మత్వా వశినాం రఘూణాం
మనం పరస్త్రీ విముఖప్రవృత్తిః!

అని ధీమాగా చెప్పగలిగిన కుశమహారాజుకూ....

భవతునామ, అనిర్వర్ణనీయం పరకళత్రం! అన్నది మీ తత్వం లాగుంది!

శకుంతలను వెంటబెట్టుకొని వచ్చిన శార్ఙ్గరవుడు,

"యదిపూర్వవృత్త మన్యాసంగాత్ విస్మృతో భవాన్ తత్కథ మధర్మభీరుః"

నిలవేస్తూంటే,

భవంత మేవాత్ర గురులాఘవం పృచ్ఛామి।
మూఢస్యామహ మేషావా వదేత్ మిధ్యేతి సంశయే
దారత్యాగీ భవామ్యాహో, పరస్త్రీ స్పర్శపాంసులః

అనీ అన్నాడు దుష్యంతుడు.

ఈ శక్తి మీ దుష్యంతుడికే చెల్లింది!

మహాకవి తలకాస్త కదిలింది!

అగ్నిమిత్రుడూ, పురూరవుడూ, దుష్యంతుడూ ముగ్గురూ స్త్రీలకు వశ్యులేకాని—

మాళవిక నవ్వు అణచుకుంది.

ఊర్వశి గమత్తుగా చూచింది. ఎలాగైనా జగత్తును చూచినది ఆవిడ!

శకుంతల మారీచాశ్రమంలో ఉన్నట్లుగానే వుంది !

క్షమించాలి మహాకవీ! పురుషవర్ణనలో మీ వర్ణనలు నిస్తులాలు.

అంత రతీదేవి విలాపమూ అజవిలాపంయుందు తీసికట్టుగానే—

కాళిదాసు కంఠం చిత్రంగా సకిలించింది. ఏం అంటారో ఏమో! ఆయన ఏమీ అనలేదు.

"రతీవిలాపం కాస్త అతి అయిందనిపించింది."

"స్త్రీ విలపిస్తోందిగదూ!"

అదా రసరహస్యం! నిజమే!

దయితా స్వనవస్థితా రతిః
నఖలుప్రేమ చలం సుహృజ్జనే!"

ఎంతగొప్ప సత్యం!

"అహమేత్య పతంగవర్త్మనా పునరంకాశ్రయిణీ భవామి తే!"

ఇక్కడ పతంగ, శబ్దానికి సూర్యుడు అనిగూడానా....మహాకవి నా కేసిచూచారు!

ద్వావిమౌ పురుషౌలోకే సూర్యమండలభేదినౌ
పరివ్రాట్ యోగయుక్తశ్చ రణేచాభిముఖోహతః!"

అన్న వ్యాసవాక్యానికి విరుద్ధం. మీరు వాల్మీకికే శిష్యులు కారు. వ్యాసుడికీ శిష్యులే!

సుదక్షిణాదేవి, "పపౌ నిమేషాలస పక్ష్మపంక్తిరుపోషితాభ్యా మివలోచనాభ్యాం"అన్నది మీరు, వ్యాసులవారి దగ్గర్నుంచి తీసుకున్నారా .... లేక మా గుడిపాటి వెంకటచలంలాగా, సహజంగానే రచించారా....!"

కాళిదాసు గంభీరంగా చూచారు! ఆ త్రికాలనేత్త్రకు మా వెంకటచలం కనబడివుంటాడు!

"రణం హృదయక్షేత్రంలోగూడా జరగవచ్చుగదా" అంది పూర్వశి! అప్పుడు వ్యాసవాక్యానికి సరిపోతుందే!

కాళిదాసు కన్నులలో మందహాసం కనిపించింది. ఆ నవ్వు ఆయన బవిరిగడ్డంలోంచి మధురంగా కనబడుతోంది!

"ఇంకా...." అన్నారాయన.

"మార్గం మనుష్యే శ్వరధర్మపత్నీ
శ్రుతేరివార్థం స్మృతిరన్వగచ్ఛత్!"

అన్నారే ఎంతగొప్పమాట!

"ఎన్నడు బెండుపల్కాదవదుమీకు!"ఐనా, మాళవిక తనలో తను—

"హృదయః సుఖితతయా, అలం ఉపస్థితోయం
విభవఇతి కథమాత్మానం మోచయితుం అథవా
ఇదానీం ఏతదేవ మే మృత్యుమండనం భవిష్యతి" అని

అనుకున్న మాటలు చురుక్కుమనిపించేవే!

అలాగే, ఊర్వశికూడా చెలికత్తె చిత్రలేఖతో

"నతావదుపసర్పిష్యే, తిరస్కరిణీ ప్రతిఛన్నా
పార్శ్వవర్తినీభూత్వా శ్రోష్యేతావత్
పార్శ్వవర్తినా వయస్యేన సహ
విజనే కింమన్త్రయన్ తిష్ఠతీతి"

అన్నవి బాగానేవున్నయ్ గాని, మీరు, మీ హుందాతనానికి తగ్గట్టు కనబడదు. శకుంతలలో....మీ శకుంతలకుసాటి మీ శకుంతలే—రచనగూడా,

ఇటికమీద ఇటికపేర్చి ఇల్లుకట్టినట్లుగా కట్టారు. మీ పరిణతికి అది అద్దం! ఎలాగైనా మీ చివరి రచన గదా....!

"ఈ మాట ఎవరు చెప్పారు?"

"నేనే వూహించుకున్నాను. రఘువంశం మీ చివరి రచన అనీ, ఆ రచనలో మీకు రుషత్వం సిద్ధించిందంటారు. శాకుంతల రచనలో తమరు రుషి అయినారు అనీ, అదే మీ చివరిరచన అనీ భావిస్తున్నాను!

"కారణం?"

"ఏ రచయిత అయినా ప్రారంభదశలో ఎంతో వూహించా ననుకుని, అదంతా రచనలోకి రావాలని ఎంతో చెప్తాడు. మాటలు వస్తూన్న పిల్లవాడు గబగబా మాట్లాడేసినట్లు — పరిణతి కలిగిననాడు అతడే, బహు క్లుప్తంగా మాట్లాడుతాడు. రుషి అయినవాడు, రుషిత్వాన్ని అందుకొనేవాడూ' ఛాందోగ్యంలోని 'సద్విద్య' అనుభవించివుండి—మాట, అంటే తనలోని తేజస్సును బహుభద్రంగా కాపాడుకుంటాడు.

రుతుసంహారంలో రుతువును గురించి ఒక సర్గదాకా విస్తరించే మీ వూనిక, శాకుంతలం దగ్గిరికి వచ్చేసరికి—

"దివసాః పరిణామరమణీయాః" అన్న కాస్తముక్కలో ఇమిడింది.

రఘువంశంలో అజమహారాజును వర్ణించే వైతాళిక గానంవుంది. నాలుగైదు శ్లోకాలు, విడివిడిగా సవివరంగా వర్ణించారు. శాకుంతలంలోనో-

యాత్యేకతో Zస్తశిఖరంపతిరోషధీనాం
ఆవిష్కృతారుణ పురస్సర ఏకతో ర్కః।
తేజోద్వయస్య యుగపద్వ్యసనోదయాభ్యా
లోకోనియమ్యత ఇవాత్మదశాంతరేషు!

అన్న ఒక్క శ్లోకంతో చాలింది. మహాకవీ, ఎంకిపాటలు రచించి, అనితరసాధ్యంగా వాటిని పాడిన మానండూరి సుబ్బారావుగారు, ఈ శ్లోకాన్ని నేను తెనిగించి చెప్తుంటే, ఎంతగా ఆనందించారో—నేను వివరించలేను.

ప్రపంచాన్ని ప్రపంచాన్నే ఇమిడ్చాడు కాళిదాసు అన్నారాయన!

మనలోమాట,

మీ భరతవాక్యాలుచూస్తే చాలదా....?

మాళవికలో—

ఆశాస్యమీతి విగమప్రభృతి ప్రజానాం
సంపత్స్యతే నఖలుగోప్తరినాగ్నిమిత్రే

అన్నది సాధారణమైనమాట! నేనైనా వ్రాయగలను.

విక్రమోర్వశీయంలో—

"సర్వస్తరతుదుర్గాణి,
సర్వే భద్రాణి పశ్యతు।
సర్వేసుఖ మవాప్నోతు
సర్వస్సర్వత్ర నందతు"

అన్నదీ ఎవరైనా వ్రాయవచ్చు. అదేం లోకోత్తరం కాదు! కాని, శాకుంతలంలో—

"మమాపిచ క్షపయతు నీలలోహితః
పునర్భవం పరిగత శక్తిరాత్మభూః!"

అన్నదో—అమ్మో. మహాకవి తిక్కన్న రచించాడు మళ్ళీ అట్లా.

"ఉపలాలితుండగు డింభకుండు తనకొలంది యెఱుంగక మహాపదార్థంబు వేడు విధంబున బ్రహ్మానంద స్థితింగోరి సర్వాంగాలింగిత మహీతలం

బగు" నమస్కారం చేశాట్ట! అంత మహాభారతాన్ని పూర్తిచేసి — శూన్య ప్రాయం అయిన సత్వంతో—

"హరిహరనాథ సర్వభువనార్చిత నన్ దయచూడు మెప్పుడున్ —"

అని నమస్కరించి ఊరుకున్నాడు ఛాందోగ్యంలో —

"లిందుమాఽభిగాం। లిందుమాఽభిగాం" అన్న రుషివాక్కు మీ వాక్కు, తిక్కనవాక్కు సమానాలు. మీ శాకుంతల భరతవాక్యానికి సాటి అదే!

"నిజం"

నా వూహనిజమే? నిజమే!

కనకదుర్గ గుడికొండ ఎక్కినట్లయింది!

"ప్రభూ! ఈ మాటగూడా చెప్పండి! మీ రచనలలో తపస్సు ముఖ్యం! పార్వతివంటి లోకోత్తరనాయిక, జగజ్జనని—

"నినిందరూపం హృదయేన పార్వతీ"

తనరూపాన్ని తాను నిందించుకుంది!

"అరూపహార్యం మదనస్యనిగ్రహాత్
పినాకపాణిం పతిమాప్తుమిచ్ఛతి!"

తెలుసుకుని తపస్సు చేసింది. పంచాగ్నిమధ్యన తపస్సు చేస్తేనేగాని శివుడు దిగిరాలేదు! వచ్చి ఓ ఆట ఆడించిగాని,

"అద్యప్రభృత్యవనతాంగి।
తవాస్మిదాసః క్రీతస్తపోభిః!"

అని చెప్పలేదూ! అలాగే మీ నాయికలూ తపస్సు ప్రాధాన్యం గుర్తించి 'తపస్తప్త్వా' సుఖపడ్డారు.

"నిజమేగాని, మహానుభావా! మీ నాయికలలో ఎవరు మీకు ఆదర్శ నాయికలుగా కనిపిస్తారు ?"

"అంటే?"

"మీకు పరిపూర్ణంగా నచ్చిన మీ నాయికలు"

"అందరూ!"

"అదేంమాట?"

నోరుజారింది. గురువును ప్రసన్నం చేసుకోబోయి, గురువుతో గ్రుద్దులాటకు దిగుతున్నానా....? తప్పుతప్పు.

"తపస్సు అన్నావు— నీ వూహ పూర్తిగా చెప్పు"

"చెప్పలేను. నా తప్పు నాకు తెలుస్తోంది. ఇలాంటప్పుడు మనస్సు కుంగుతుందిగాని, పొంగదు. భావజ్ఞి మన అమ్మవారు. జగజ్జనని. ఆమె అనుగ్రహం సంపూర్ణంగా ఉన్నవారు, భావజ్ఞులు మీరు. మీరుచెప్తే వింటాను.

"సరే—ఈ చెప్పబోయేవి నీ వూహలు :

రూపసంపద గొప్పదే. కాని అదొక్కటే ప్రణయ క్రతువుకు శాంతిని కలిగించదు. ఆకర్షణ వుంటుంది అంతే.

మాళవిక రూపంచూచి అగ్నిమిత్రుడు ఆకర్షింపబడ్డాడు. లోక సామాన్యం.

ఊర్వశి శరీరశోభ — ఆభరణానికి ఆభరణం, ప్రసాధనవిధికి ప్రసాధనవిధి, ఉపమానానికి ప్రత్యుపమానం. మాటల గడుసుదనం తప్ప మరేముంది? శకుంతలదో, అన్ని మెట్లూ దాటింది.

అనాఘ్రాత. పుష్పం
కిసలయమలూనం కరరుహైః
అనావిద్ధంరత్నం, మధునవ మనాస్వాదిత రసం—

ఇవీ బజారుమాటలే. గుంభనగా వున్నయ్.

"అఖండం పుణ్యానాంఫలం" అన్నదో.... మెట్టెక్కారు! మా నాయని సుబ్బారావుగారు—

మత్పురానేక పూర్వపుణ్యములు పండి
జాహ్నవీస్వచ్ఛమును సుధాస్వాదుమధువు
నైన నీదివ్యసాన్నిధ్య మందుకొంటి

పుడమికిన్ స్వర్గమున కొక్కముడి రచించి' అన్నదానిముందు, మా కృష్ణశాస్త్రి—

ఓరగా ఓరగా ఒరుగునింద్రుని శిరసు
విడిపోయి దిగిపోయి పడెనేమొ నాగ్రమోల!
వైకుంఠ మృదుకంఠ వైజయంతీమాల

అన్నదానికీ, మీ రచన సాటి!

అయినా మీకు రూపసంపద విలువ తెలుసుగనుక, శకుంతలచేత మారీచాశ్రమంలో తపస్సు చేయించిమరీ ఆమెకు ప్రశాంతిని కలిపించారు. మీ రచనల్లో కామదహనమూ దుర్వాసశాపమూ మీ రుషత్వానికి చెందినవి.

"ఇక మా మాటలు విను!"

మహాకవి నా సందేహాలు తీరుస్తున్నారు!

ఊర్వశిని సృష్టించేనాటికే — యోగంమీదకి ప్రాలింది మా దృష్టి. సగం వెన్నెలలాగా, ఉన్నసాధన ప్రారంభదశలోది. నీవు తృప్తిపడలేని మా రచన – విక్రమోర్వశీయం.

సాధన బాగాపెరిగి, లోకవాసనలు దిగజారిపోతున్న దశలో రచించింది శాకుంతలం! మాకు తెలుసు – నీవుగూడా శకుంతలతోపాటు ఏడవడము, గుండె బండరాయి చేసుకొని, మారీచాశ్రమంలో తిరుగాడడం నీవు గుర్తించింది నిజమే–

శాకుంతలం పూర్తిచేసేప్పుడు, భరతవాక్యం రచించేప్పుడు

"శ్యామాచ్ఛబలం ప్రపద్యే
శబలాచ్ఛ్యామం ప్రపద్యే
అశ్వఇవ రోమాణి విధూయపాపం,
చంద్ర ఇవరాహోర్ముఖాత్ ప్రముచ్య
ధూత్వా శరీరమకృతం కృతాత్మా
బ్రహ్మలోక మభిసంభవామీత్యభి సంభవామితి"

గానేవుంది మనస్థితి. మరోసంగతి— "పూర్వశి అంత పక్వరచన గనుకనే, తిరిగి వ్రాసుకోవలసి వచ్చింది—అన్నీ కలిసి వచ్చాయి, జన్మించాము! శాకుంతలకు ఆ ఇదిలేదే, పరిపూర్ణమైన సృష్టి!"

"అవును. అవును. మీరు శ్రీ అరవిందులై జన్మించారనీ, పూర్వశిని తిరిగి వ్రాశారనీ, తిరువన్నామలైలో జ్ఞానులు చెప్పారు! ఆఁహా!"

మహాకవి నాకేసే చూస్తున్నారు!

ఒక్కప్రశ్న: మీరే నాయకుడు అనుకోండి! మీరు, మీ సహచరిగా మీరు ఎన్నుకునేది, మాళవికనా, పూర్వశినా, శకుంతలనా....?

"ఎవర్నీకాదు. వారు మా బిడ్డలు!"

"ఒకవేళ"

"ఆ ప్రశ్నేరాదు"

"మానవమాత్రులం. మా వెర్రి సరదాలను మన్నించండి. మాకోసం ....ఒకవేళ...."

"శకుంతలనే.... ఆమె అఖండం పుణ్యానాంఫలం..." అంటామని వుంది నీకు కాదూ!....

"అవును. శృంగారపరంగా చూచినా.... చలాపాంగదృష్టి, ఉన్నమిత్రైకభ్రూలత, మొదలయినవి మీ మాళవికకేవీ? ఊర్వశికేవీ".... కనకనే, చివరికి,

"సుతను హృదయాత్ ప్రత్యాదేశవ్యళీకముపైతుతే" అని దుష్యంతుడు ఆమెను ఓదారుస్తూంటే – ప్రాణాలు లేచివచ్చినట్లుగా వుంటుంది. మహాత్మా! లోకోత్తరమైన సృష్టిచేశారు!

ఋగ్వేదంలోని ఊర్వశికి నాజూకుతనం నేర్పారు.

రాజకుమారి మాళవికకు, మనోనిదాఘ మాధుర్యం కల్పించారు.

మీ గొప్పతనం మరీ ఎక్కడంటే,

మీరు త్రిలోకమాత, శ్రీచక్రేశ్వరికి భక్తులు.

"తల్లి" అని పిలుచుకున్న ముద్దుబిడ్డలు.

అయినాగూడా, పార్వతీదేవి-క్రీడను వర్ణించారు!

ఆ దంపతులు- క్రీడిస్తేగాని జగద్వ్యాపారం జరగదు!

పైగా మన అమ్మవారు,

"హరనేత్రాగ్ని సందగ్ధకామసంజీవనౌషధిః!"

ఆ ఒక్క నామంలోంచి కుమారసంభవ మహాకావ్యాన్ని ఓడ్చుకున్నారు!

పార్వతీదేవి అంతస్త్రీని శకుంతలను సృష్టించారు. వ్యాసులవారి శకుం తలకు ఎంతెంత మెరుగులు దిద్దారు! ఆ చల్లనితల్లి బిడ్డడిపేరనే, ఈ భరత ఖండం ప్రతిష్ఠావాచకం అయింది! ఏమండీ—

"వల్మీకార్ధ నిమగ్నమూర్తిరురసా సందష్ట సర్పత్వచా కంఠే
జీర్ణ లతాప్రతాన వలయే నాత్యర్ధ సంపీడితః!"

ఇలాంటివి ఎట్లా వూహించారండీ! మీ తపోబలంతో ఏ యుగాల లోని మహర్షులను సందర్శించి వ్రాశారోగానీ, "ప్రాణానామనిలేనవృత్తి రుచితా...." ఇత్యాదులు మాలో గొప్పకవులు వ్రాశారు! మీ తరువాత భవ భూతి గూడా అట్లాగే,

ప్రియప్రాయావృత్తిః....

రచించాడు!

మీ తపశ్శక్తికి మీ పుష్పితవాక్కు ఫలితం! ఇది లోకానికి పండగ.

రఘుకుమార మేఘదూతలను, శాకుంతలాన్ని మీ పేరు చెప్పుకుంటూ చదువుకుంటున్నాము.

"కావ్యాలలో నీవు....?"

శ్రీ రవీంద్రనాథటాగూర్‌కు మేఘదూత ఇష్టం.

శ్రీ రుక్మిణీనాథశాస్త్రికి కుమారసంభవం ఇష్టం.

అభిరుచిలో భేదం. అంతే.

మహాత్మా, మనసా వాచా, కర్మణా నమస్కరిస్తున్నాను. ముప్పై సంవత్సరాల కల, మిమ్మల్ని చూడాలనుకున్న కల నిక్కం అయింది! సాష్టాంగపడ్డాను!

లేచిచూద్దునుగదా—ఎవరూలేరు!

మచిలీపట్నం.

మా ఇల్లు—

మాఇంట్లో తిరుగుతూన్న ఆవు !

ఆవు అంబా అని అరిచింది. ఉలిక్కిపడి లేచాను!

వికసించడానికిగాను, మందారపుష్పం.

వేసారుతోంది!